

వేంపల్లె పట్టణం జీఎం కాంప్లెక్స్‌లో సోమవారం ప్రచారానికి వచ్చిన వైఎస్ భారతిని పట్టాదారు పాసుబుక్కుపై జగన్ ఫొటోలు ఎందుకని ప్రశ్నిస్తున్న వైసీపీ నేత భాస్కర్‌రెడ్డి



సీఎం అడ్డాలో.. వైసీపీకి సెగలు

- ప్రభుత్వ విధానాలపై ప్రశ్నిస్తున్న వైసీపీ శ్రేణులు
- మా భూములపై జగన్ ఫొటోలెందుకంటూ నిలదీత
- సీఎం సతీమణి భారతికి చుక్కెదురు
- సమస్యలపై నిలదీస్తున్న జనం
- ఎంపీ అవినాశ్‌కు చేదు అనుభవం

(కడప-ఆంధ్రజ్యోతి): ఇది మా అడ్డా.. మేం చెప్పిందే వేదం. మేం చేసిందే శాసనం. పోకిరి సినిమాలో ప్రకాశ్‌రాజ్ గిల్లితే గిల్లించుకోవాలి అంటాడు. అలాగే మేం ఏం చేసినా కామ్‌గా ఉండాలి. ఇప్పటి దాకా వైసీపీ నేతలు అలాగే జనాన్ని భావించారు. ముఖ్యంగా ఎంపీ అవినాశ్ నుంచి జగన్ అండ్ కో జిల్లాలో అంతా మాదే రాజ్యం అంటూ అధికార వ్యవస్థను చెప్పు చేతల్లో పెట్టుకున్నారనే విమర్శ ఉంది. అందుకు తగ్గట్లుగానే ఏదైనా ఇష్యూలో పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేయాలన్నా.. మా భూములు ఎవరో కొట్టేశారని తహసీల్దారుకు ఫిర్యాదు చేయాలన్నా... పింఛను రాలేదని సచివాలయంలో అడగాలన్నా.. అంతా వైసీపీ అండ్ కో ఆశీస్సులు, సిఫార్సులు ఉంటేనే పనులు ముందుకు వెళతాయి. దీంతో జిల్లా జనం అంతా మా గుప్పిట్లో ఉన్నారంటూ వైసీపీ నేతలు భావించేవారు. అయితే మాది కడప జిల్లానే. మేం తినేది గొడ్డుకారమే. మాకు కోపతాపాలు ఉంటాయి.. అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోలేం.. అనే రీతిలో నిలదీయడం, ప్రశ్నల వర్షం కురిపిస్తుండటం.. ఇప్పుడు వైసీపీని కలవరపాటుకు గురి చేస్తోంది.

సీఎం జగన్ సతీమణి వైఎస్ భారతిరెడ్డి ఆమె భర్త జగన్ గెలుపు కోసం పులివెందుల నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తోంది. తొలిరోజు తొండూరు మండలంలో ఆమె ప్రచారానికి వెలుతుండగా... అక్కడ స్థానికంగా వైసీపీలో ఉన్న మూడు గ్రూపులు ముందుగా మా ఏరియా నుంచి ప్రచారం చేయాలంటూ పోటీపడి చివరికి కొట్టుకున్నారు. ఆ సీన్ అప్పటికి సర్దుమణిగిపోగా.. సోమవారం భారతి వేంపల్లెలో పర్యటించింది. ఈ సందర్భంగా ఊహించని రీతిలో వైసీపీ నేతలు భారతిని నిలదీయడం చర్చనీయాంశమైంది. పట్టాదారుపాస్ పుస్తకాలు, జగనన్న భూసర్వేలో జగన్ ఫొటోలు ఉండడంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. రైతులు కూడా అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. వేంపల్లె ప్రచారంలో వైసీపీ నేత, కుమ్మరాంపల్లె మాజీ సర్పంచు భర్త భాస్కర్‌రెడ్డి మా తాతల కాలం నుంచి వారసత్వంగా వచ్చే పట్టాదారు పాస్‌పుస్తకాలపై సీఎం జగన్ ఫొటో ఎందుకు అంటూ భారతిని నిలదీశారు. సీఎం ప్రతిసారి నా ఎస్సీ, నా బీసీ, నా మైనార్టీ అంటారు తప్ప ఒక్కసారి కూడా మా రైతన్న అనడం లేదు.. ఇదేనా రైతులపై ప్రేమ అనే విధంగా ఘాటుగా ప్రశ్నించారు. రైతు భరోసా కింద జగన్ ఇచ్చే డబ్బులో కేంద్రం రూ.6వేలు ఇస్తుందంటూ చెప్పుకొచ్చారు.

ఇక మంగళవారం వేంపల్లె ప్రచారంలో వైసీపీ నేతలు భారతి వద్దకు వచ్చి రాజశేఖర్‌రెడ్డి హయాంలో రైతులకు మంచి జరిగేది. అయితే జగన్ వచ్చిన తరువాత రైతులకు న్యాయం జరగడం లేదు. రైతులంతా ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారు. రుణమాఫీ ప్రకటించాలంటూ డిమాండ్ చేయడం, ఒకేసారి రుణమాఫీ చేయలేకపోయినా రెండుసార్లు రుణమాఫీ చేస్తామని జగన్‌తో హామీ ఇవ్వాలనే విధంగా భారతిని వైసీపీ లీడర్లు కలిసి డిమాండ్ చేయడమే హాట్‌టాపిక్‌గా మారింది. ఇక మాకు ఇల్లు రాలేదు, మరుగుదొడ్లు లేవంటూ ఆమె దృష్టికి తెచ్చారు.

కడప జిల్లా అన్నా.. పులివెందుల అన్నా మా అడ్డా అనే భావనలో ఉండే వైసీపీ భారతికి ఊహించని విధంగా జనం నుంచి నిలదీతలు రావడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవలే ఎంపీ అవినాశ్‌రెడ్డి అట్లూరు మండలంలోని రెడ్డిపల్లె క్రాస్‌రోడ్డు, చెండువాయి, ఉప్పటూరు, ముద్దేరులో ప్రచారం చేశారు. మీకు ఓటు కల్పిస్తే మా సమస్యలను పట్టించుకోలేదు. మళ్లీ మేం ఐదేళ్లకు గుర్తుకు వచ్చామా అంటూ నిలదీశారు. స్థానికగా వైసీపీ నాయకుడు పట్టించుకోలేదు. తాగునీటి పైపులైన్లు వేయలేదు. విద్యుత్ తీగలు కరెంటు సౌకర్యం లేదు, డ్రైనేజీ అస్తవ్యస్తం, రోడ్లు లేవు. రాత్రిపూట బజారులో తిరగలేకపోతున్నాం అంటూ జనం అవినాశ్ వద్ద ఏకరువు పెట్టారు. చింతవాండ్లపల్లె, ఆకుతోట పల్లె, చలంగారిపల్లె, అగ్రహారం గ్రామాల నిర్వాసితులకు పరిహారం ఇస్తామని చెప్పి ఇంత వరకు ఇవ్వలేదంటూ జనం నిలదీశారు. అది అప్పుడు సంచలనమైంది. ఇప్పుడు జిల్లాలో జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు, బద్వేలు, కమలాపురంలో ప్రచారానికి వెళ్లినప్పుడు సమస్యలపై జనం ప్రశ్నించడం వైసీపీ నేతలను ఆందోళనకు గురి చేస్తోంది.



టిడ్కో ఇళ్లకు రాచమల్లు గ్రహణం

'సెంటు స్థలంలో నిర్మించే టిడ్కో ఇళ్లలో ఒక చిన్న కుటుంబం కూడా నివశించలేదు.. మా ఇళ్లలో బాతురూంలు ఉన్నంత కూడా లేవు... ఆ ఇళ్లకు లబ్ధిదారులు డబ్బులు కట్టి రుణగ్రస్తులు కావద్దు' అంటూ నాడు ప్రతిపక్ష ఎమ్మెల్యేగా రాచమల్లు ప్రసాద్‌రెడ్డి పెద్దఎత్తున వాడవాడల తిరిగి ప్రచారం చేశారు. అప్పట్లో వసంతపేట సాయిబాబా దేవాలయం వద్ద టిడ్కో గృహ నిర్మాణాలపై నమూనా గృహంతో ప్రచారం చేశారు. వైసీపీ ప్రభుత్వం వస్తే రెండు సెంట్లలో ఉచితంగా ఇళ్లు నిర్మించి లబ్దిదారుల నుంచి ఒక్కరూపాయి తీసుకోకుండా రిజిస్ట్రేషన్ చేయించి.. ఒకచేత్తో పట్టా, మరో చేత్తో ఇంటి తాళం ఇవ్వకుంటే తూ నాకొడకా అనండని.. లేదంటే 2024 ఎన్నికల్లో ఈ ముఖంతో ఓట్లడగనని తేల్చి చెప్పారు. ఇలా ప్రతి పక్ష ఎమ్మెల్యేగా రాచమల్లు విలువైన స్థలాల్లో నిర్మించే టిడ్కో ఇళ్లను పేదలకు దక్కకుండా అడ్డుకున్నారు.

- ప్రతిపక్ష ఎమ్మెల్యేగా అడ్డుకున్న వైనం
- సెంటు స్థలంలో ఇల్లెట్లా అని ప్రశ్నించారు
- వాడవాడలో తిరిగి ప్రచారం
- విలువైన స్థలాల్లో పేదలకు ఇళ్లు దక్కకుండా కుట్ర
- వైసీపీ అధికారంలోకి వచ్చాక..
- టిడ్కో స్థలాలు సెంటు రూ.5లక్షలతో విక్రయిస్తున్న ప్రభుత్వం
- పనికారాని భూముల్లో పేదలకు ఆవాసాలు
- రెండు సెంట్ల స్థలంలో ఇల్లు కట్టి తాళాలు ఇస్తానన్న హామీ వొమ్ము
- లబ్ధిదారులపై మోపిన అప్పుల భారం



టిడ్కో ఇళ్ల స్థలాల్లో జగనన్న స్మార్ట్ కాలనీకి పూజలు చేస్తున్న రాచమల్లు (ఫైల్)



టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు

ప్రొద్దుటూరు, మే 1: పేదల సొంతింటి కల నెరవే ర్చేందుకు టీడీపీ ప్రభుత్వం 2017-18 సంవత్సరంలో టిడ్కో సంస్థ ఆధ్వర్యంలో జీ+3 పద్ధతిలో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందుకోసం ప్రొద్దుటూరు పట్టణంలోని రింగ్‌రోడ్డు హైవే పక్కన ఆర్‌టీవో కార్యాలయం వద్ద 72 ఎకరాలలో కోట్ల విలువైన అపెరల్ పార్కు కోసం సేకరించిన ప్రభుత్వ భూమిని ఇళ్ల నిర్మాణానికి కేటాయించింది. ఇళ్ల కోసం 4907 మంది దరఖాస్తు చేసుకోగా.. 4,401 మంది లబ్ధిదారులను అర్హులుగా ఎంపిక చేసింది. ఇందులో కేటగిరి-1 కింద 376 మంది, కేటగిరి-2 కింద 140 మంది, కేటగిరి-3 కింద 395 మంది మొత్తం 911 మంది డబ్బులు చెల్లించారు. వీరిలో కేటగిరి-1కింద 340 మందికి, కేటగిరి-2 కింద 131, కేటగిరి-3 కింద 354 మంది మొత్తం 825 మందికి ప్లాట్లు కూడా అలాట్ చేశారు.

వైసీపీ అధికారంలోకి రాగానే.. పేదలపై పగ

2019లో వైసీపీ ప్రభుత్వం రాగానే సీఎం జగన్ కక్ష సాధింపు చర్యలలో భాగంగా మాజీ సీఎం చంద్రబాబు చేపట్టిన పనులన్నింటికి రివర్స్ టెండర్ పేర నిలిపివేశారు. అందులో భాగంగా ప్రొద్దుటూరులో టిడ్కో ఇళ్ల నిర్మాణం నిలిపేశారు. ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి పేదలపై పగబట్టి పట్టణంలో ఉన్న టిడ్కో ఇళ్లు వారికి దక్కకుండా చేశాడు. రూ.12 కోట్లతో నిర్మించిన 144 టిడ్కో అపార్ట్‌మెంటు ఇళ్లను కూలగొట్టి ఆ స్థలాలు అనుడాకు అప్పగించి.. తమ ప్రభుత్వం సెంటు రూ.5 లక్షలకు అమ్ముకునేలా చేశాడు. దాదాపు 72 ఎకరాల్లో 43.88 ఎకరాలలో 484 పాట్లు వేసి 3,4,5 సెంట్ల ప్లాట్లుగా విభజించి విక్రయించింది. వీటిని సెంటు రూ.5లక్షల వంతున 43.88 ఎకరాలు విక్రయించి రూ.215 కోట్లు ప్రభుత్వం తమ ఖజానాలో వేసుకోనుంది. పట్టణాల్లోని పేదలను ఆవాసయోగ్యం కానీ స్థల్లాల్లో ఇల్లు నిర్మించి పల్లెలకు వెళ్లేలా కుట్ర చేశారు. విలువైన టిడ్కో స్థలాలు కోట్ల రూపాయలకు విక్రయించి.. అందులో జగనన్న స్మార్ట్ కాలనీ నిర్మాణాలను చేపట్టడానికి పనులు చేపట్టారు.

ఇళ్లు కాదు.. ఊర్లు నిర్మిస్తున్నామంటూ..

జగనన్న కాలనీల పేర ప్రొద్దుటూరు మండల పరిధిలోని రామేశ్వరం, బొల్లవరం మీనాపురం లేఅవుట్‌లలో 478 ఎకరాలలో 23 వేల మందికి సెంటు స్థలంలో ఇళ్ల నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వం 2020 డిసెంబరులో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. మూడేళ్లు దాటినా 2024 ఏప్రిల్ 16 నాటికి కేవలం 303 ఇళ్లు పూర్తయినట్లు హౌసింగ్ అధికారుల నివేదికలు తెలుపుతున్నాయి. నివాసయోగ్యం కానీ పనికిరాని భూములలో పట్టణానికి కిలో మీటర్ల దూరంలోని పల్లెల్లో కేవలం సెంటు స్థలంలో ప్రభుత్వం ఇళ్లు కట్టించకుండా లబ్ధిదారులతో 35 వేల వంతున డబ్బులు వసూలు చేసింది. లబ్ధిదారులే నిర్మించుకోమని చెప్పి చేతు లెత్తేసింది. దీంతో ఆ సెంటు స్థలాల పట్ల లబ్ధిదారులు తీవ్ర విముఖతతో వాటిని నిర్మించు కోకుండా వదిలేశారు. రాచమల్లు ప్రసాద్‌రెడ్డి మాటలు విని విలువైన టిడ్కో ఇళ్లను పోగొట్టుకున్న పేదలు తీవ్ర ఆగ్రహంతో వున్నారు. అతని కుట్రలు తెలుసుకుని రాబోవు ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పాడానికి సిద్ధంగా ఉన్నట్లు పలువురు టిడ్కో లబ్ధిదారులు ఆవేదనతో వెల్లడించారు.

కాలనీల పేరుతో రూ.85 కోట్లు వసూలు

జగనన్న కాలనీల పేర నిర్మించే ఇళ్లకు లబ్ధిదారుల నుంచి ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధి లోనే రూ.85 కోట్లు మేర వసూలు చేశారు. కానీ నేటికి లబ్ధిదారుల స్థలాల్లో పునాదులు సైతం నిర్మించలేదని.. ఈ డబ్బులన్నీ కాంట్రాక్టర్ల పేర వైసీపీ నేతల బినామీలు తమ జేబుల్లో వేసు కున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రెండుసెంట్ల మాట నిలబెట్టుకోని రాచమల్లు

విలువైన స్థలాల్లో టీడీపీ ప్రభుత్వం నిర్మించే సెంటు స్థలంలోని టిడ్కో ఇళ్లు వద్దు.. రెండు సెంట్ల స్థలంలో ఇళ్లను లబ్ధిదారుల వద్ద నుంచి ఒక్క రూపాయి తీసుకోకుండా నిర్మించి ఇస్తా నన్న మాటను ఎమ్మెల్యే రాచమల్లు నిలబెట్టుకోలేకపోయారు. 2024 ఎన్నికలలో ఈ ముఖం చూపెట్టనని మళ్లీ అదే ముఖంతో ఓట్లగడానికి వస్తున్నాడు.



బాబు కట్టిస్తున్న పక్కా గృహ నమూనా అంటూ రాచమల్లు నిరసన



పునాది దశ దాటని జగనన్న సెంటు ఇళ్లు

మాయాజాలం

- వైఎస్ఆర్ బీమా అమలులో ఆలస్యం
- అరకొర పరిహారం
- సంవత్సరాల తరబడి ఎదురుచూపులే
- జగన్‌పాలనలో బాధితులకు ఏదీ భరోసా..?

'అనుకోని పరిస్థితుల్లో ఇంటి పెద్దను కోల్పోయిన కుటుంబాలకు అండగా ఉంటాం.. బీమా క్లయిమ్ చేసిన పదిహేను రోజుల్లోపు దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబానికి పరిహారం జమ చేస్తాం.." అంటూ గతంలో గొప్పలు చెప్పిన జగన్ తన ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక వైఎస్ఆర్ బీమా పథకం అమలు చేశారు. అయితే అమలులో మాత్రం చతికిలపడ్డారు. సంవత్సరాలు గడుస్తున్నా పరిహారం అందక బాధితులు గగ్గోలు పెడుతు న్నారు. జగన్ మాత్రం చిరునవ్వులు చిందిస్తూ.. కుటుంబ అండను కోల్పోయిన నిరుపేదల ఆశలను సమాధి చేస్తున్నారు.

కడప (ఎన్టీఆర్ సర్కిల్), మే 1: అనుకోని సంఘటనల్లో మృత్యువు కబలించినా.. ఆ కుటుంబం పెద్దదిక్కును కోల్పోయినా నేనున్నానంటూ భరోసానిచ్చే ప్రభుత్వ బీమా ను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. అధికారంలోకి వచ్చిన రెండేళ్లు బీమా ఊసే లేకుండా చేసి వేలాది మంది బాధితులకు జగన్ ప్రభుత్వం అన్యాయం చేసింది. ఆ తరువాత ఇస్తున్న పరిహారంలో రకరకాల సాకులు చూపి కోతలు పెడుతూ నిరుపేద కుటుంబాలకు కన్నీటినే మిగిల్చింది. అర్హత ఉన్న కుటుంబాలు సైతం జగన్ అసమర్థతతో పరిహారం కోసం ఏళ్లతరబడి నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది.

టీడీపీ హయాంలోనే ప్రయోజనం

ఇంట్లో ఎవరు చనిపోయినా టీడీపీ ప్రభుత్వ హయాంలోనే చంద్రన్న బీమా వల్ల బాధిత కుటుంబానికి ప్రయోజనం చేకూరేది. అంత్యక్రియలకు ముందే పదివేల రూపాయలు అందించేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత అసలు పథకం ఊసే లేదు. తాజాగా ఎన్‌డీఏ ప్రకటించిన ఉమ్మడి మేనిఫెస్టోలో చంద్రన్న బీమాను రెట్టింపు చేసింది. గత టీడీపీ హయాంలో సహజ మరణాలకు రూ.2లక్షలు, ప్రమాదంలో మరణించిన వారికి రూ.5 లక్షలు ఇచ్చేవారు. అయితే తిరిగి అధికారం చేపడితే ఇప్పుడున్న బీమా పాలసీని మార్పులు చేసి కుటుంబంలో ఎవరు చనిపోయినా సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదం వల్ల మరణించినట్లయితే రూ.10లక్షలు ఇవ్వనున్నట్లు చంద్రబాబు ప్రకటించారు.

ప్రస్తుత జగన్ ప్రభుత్వంలో..

ప్రస్తుత జగన్ ప్రభుత్వం 2021లో వైఎస్ఆర్ బీమాను మొదలుపెట్టినప్పటికీ అనేక మార్పులు తీసుకువచ్చి కోతలు విధించింది. కుటుంబంలో సంపాదించే వ్యక్తికే పరిహారం ఇస్తామంటూ కొర్రీలు పెట్టి అడ్డగోలుగా వ్యవహరిస్తోంది. జిల్లాలో మొత్తం 5,84,602 రేషన్ కార్డులు ఉండగా, ఈ పథకానికి రూ.4,94,579 మందిని మాత్రమే నమోదు చేశారు. ఈ లెక్కన 90023 మంది వైఎస్ఆర్ బీమా పథకానికి దూరంగా ఉన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో వైఎస్ఆర్ బీమా కింద 553 మంది సాధారణ మరణాలకు, 112 మంది ప్రమాద మరణాలకు సంబంధించి కాల్ సెంటర్లలో నమోదు చేసుకోవడం జరిగింది. అయితే ప్రభుత్వం మాత్రం 84 ప్రమాద మరణాలకు, 481 సాధారణ మరణాలకు బీమా చెల్లించడం జరిగింది. నమోదు అయినప్పటికీ మరణాల్లో కూడా వివిధ రకాల కారణాలు చూపుతూ వందలాది దరఖాస్తులను పక్కన బెడుతున్నారనేందుకు ఇందుకు ఉదాహరణ.

నేడు కడపకు చంద్రబాబు రాక

(కడప-ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు గురువారం కడపలో జరిగే ప్రజాగళం బహిరంగసభలో పాల్గొననున్నారు. చంద్రబాబు గురువారం మధ్యాహ్నం 1.55 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి బయల్దేరి 2.50కి కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 3.10కి కడప ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక హెలిక్యాప్టరులో బయల్దేరి అన్నమయ్య జిల్లా రాయచోటికి వెళతారు. అక్కడ సాయంత్రం 5గంటలకు మీటింగ్ ముగించుకుని 5.20కి హెలిక్యాప్టరులో బయల్దేరి 5.40కి కడప ఎయిర్‌పోర్టు చేరుకుంటారు. 5.55కు ఎయిర్‌పోర్టు నుంచి బయల్దేరి ఐటీఐ, సంధ్యాసర్కిల్, కోటిరెడ్డిసర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్‌మీదుగా సెవెన్ రోడ్స్ సర్కిల్‌కు వస్తారు. 7 గంటల నుంచి 8.30లకు బహిరంగసభలో పాల్గొంటారు. అనంతరం 8.25కు సెవెన్‌రోడ్సు నుంచి బయల్దేరి 8.45కు కడప ఎయిర్‌పోర్టు చేరుకుని, అక్కడ నుంచి 8.50కి ప్రత్యేక విమానంలో బేగంపేట వెళతారు.

టీడీపీ నేతలకు రాష్ట్రస్థాయి పదవులు

- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అమీర్‌బాబు
- కార్యనిర్వాహక కార్యదర్శిగా లక్ష్మిరెడ్డి



అమీర్‌బాబు | లక్ష్మిరెడ్డి | కొండారెడ్డి | మధుసూదన్‌రెడ్డి

(కడప - ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కమిటీలో పలువురు జిల్లా నేతలకు సముచిత స్థానం కల్పించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కడపకు చెందిన వీఎస్ అమీర్‌బాబును నియమించారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా అలంఖాన్‌పల్లెకు చెందిన సీనియర్‌నేత లక్ష్మిరెడ్డి, కార్యదర్శులుగా ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కొడుకు నంద్యాల కొండారెడ్డి, పులివెందులకు చెందిన తూగుట్ల మధుసూదన్‌రెడ్డిని నియమించారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు వీరిని నియమించారు.

హంతకులకు ఓట్లు వేయవద్దు

- హత్య చేసిన వారే చట్టసభలకు వెళితే చట్టం అపహాస్యం
- నేరం వైపా.. న్యాయం వైపా.. ప్రజలే తేల్చుకోవాలి
- ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి



బద్వేలులో జరిగిన బహిరంగసభలో మాట్లాడుతున్న వైఎస్ షర్మిలారెడ్డి

బద్వేలు/పోరుమామిళ్ల/కలసపాడు/కాశినాయన/బి.కోడూరు, మే 1: హత్య చేసిన వారే చట్టసభలకు వెళితే చట్టం అపహాస్యం పాలవుతుందని... హంతకులకు ఓట్లు వేయవద్దని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిలారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం ఆమె రెండో విడత ఎన్నికల ప్రచారం బద్వేలు నియోజకవర్గం కాశినాయన మండలంలోని వడ్డమాను గ్రామం నుంచి చేపట్టారు. అనంతరం కలసపాడు, పోరుమామిళ్ల, బి.కోడూరు, బద్వేలు, అట్లూరు మండలాల్లో బస్సుయాత్ర సాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సొంత తమ్ముడు, ప్రస్తుత సీఎం జగన్‌కు సొంత చిన్నాన్న వైఎస్ వివేకానందరెడ్డిని ఐదేళ్ల క్రితం హత్య చేస్తే.. జగన్ ఇప్పటి వరకు పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. హత్య చేయించిన వారినే మళ్లీ కడప ఎంపీ అభ్యర్థిగా నిలబెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రే నిందితుల పక్షాన నిలబడడం దేశ చరిత్రలోనే మొదటిసారి అన్నారు. సీఎం హోదాలో ఉన్న వ్యక్తి అన్యాయానికి కొమ్ము కాస్తున్నారని మండిపడ్డారు. సొంత చెల్లెళ్లకే న్యాయం చేయలేని సీఎం ప్రజలకు ఏం న్యాయం చేస్తారన్నారు. అవినాశ్‌రెడ్డిని ఓడించి మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి తమ్ముడికి న్యాయం చేకూర్చాలని ఆమె కోరారు. ఎంపీగా తనను ఆశీర్వదించి గెలిపిస్తే కడప ప్రజల కోసం ప్రత్యేక హోదా కోసం ఢిల్లీలో పోరాడుతానని అన్నారు. కడప ఎంపీగా మీ రాజశేఖర్‌రెడ్డి బిడ్డ పోటీ చేస్తూ మీ ముందు కొంగు పట్టి ఓట్లు అడుగుతున్నానని, మీరు న్యాయం వైపు ఉంటారో హంతకుల వైపు ఉంటారో మీరే నిర్ణయం తీసుకోవాలన్నారు. వివేకానందరెడ్డి కుటుంబానికి న్యాయం జరగాలంటే వచ్చే ఎన్నికల్లో న్యాయం, ధర్మం పక్షాన ఎంపీగా పోటీలో నిలిచిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బిడ్డ షర్మిలారెడ్డికి, బద్వేల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలిచిన ఎన్డీ విజయజ్యోతికి హస్తం గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. వైఎస్ హయాంలో రైతన్నలకు సబ్సిడీలు అందేవని, జగన్ పాలనలో సబ్సిడీలు కరువయ్యాయని, డ్రిప్ ఇరిగేషన్‌కు కూడా నిధులు రాలేదన్నారు. ఎన్నికల ముందు జగన్ 3వేల కోట్లు రైతులకు స్థిరీకరిస్తామని.. పంట నష్టానికి 4వేల కోట్లు కేటాయిస్తామని చెప్పి రైతులను మభ్యపెట్టారన్నారు.

ఒక్క హామీ నెరవేర్చలేదు

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు అధికారంలో ఉండి జిల్లా ప్రజలకు చేసింది ఏమీలేదన్నారు. కడప స్టీల్ ప్లాంట్‌తోపాటు ఏఒక్క హామీని జగన్ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. జగన్ అధికా రంలో ఉన్న ఈ ఐదేళ్లు వారికున్న అధికారంతో వివేకానందరెడ్డిని చంపిన హంతకులను కాపాడుకుంటూ వస్తున్నారన్నారు.

జగన్‌రెడ్డి అహంకారానికి బుద్ధి చెప్పాలి

హంతకుడిని ఓడిచేందుకు ఈ ఎన్నికలలో పోటీ చేస్తున్నానని... తనను గెలిపించి జగన్‌రెడ్డి అహంకారానికి బుద్ధి చెప్పాలని షర్మిలారెడ్డి పేర్కొన్నారు. ధర్మానికి, అధర్మానికి మధ్య జరుగుతున్న ఈ ఎన్నికలలో తనని దేవుడు ధర్మం వైపు నిలబడమని శాసించారన్నారు. తన చిన్నాన్న హత్య కేసులో నిందితుడుగా ఉన్న అవినాశ్‌రెడ్డిని సీబీఐ అరెస్టు చేయకుండా ముఖ్యమంత్రి హోదాలో జగన్ అడ్డుకుంటున్నారని ఆమె ఆరోపించారు. ఈ హత్యకేసులో కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నాయన్నారు. కడప ఎంపీగా అవినాశ్‌రెడ్డి ఏనాడు పార్లమెంటులో స్టీలు ప్లాంటు నిర్మాణం గురించి కానీ, సమస్యల గురించి కానీ ప్రస్తావించలేదన్నారు. ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పుడు ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ ఎన్నో హామీలు ఇచ్చారని.. ప్రతి సంవత్సరం జాబ్ కేలండర్ వదులుతానని హామీ ఇచ్చి ఐదేళ్లలో ఏ ఒక్కరికీ ఉద్యోగం ఇచ్చిన పాపాన పోలేదని విమర్శించారు. పూర్తిగా మద్యపాన నిషేదం చేసి ఓట్లు అడుతానని చెప్పిన జగన్ నాసిరకం మద్యం అమ్మిస్తూ ప్రజల ప్రాణాలు తీస్తున్నారన్నారు. బ్రహ్మంసాగర్, సోమశిల ఎత్తిపోతల పథకాల ద్వారా బద్వేలు నియోజకవర్గంలో 40 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తామన్న జగన్ హామీ నీటి మూటలయ్యాయని ఆమె తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

కాంగ్రెస్ వస్తే ప్రత్యేక హోదా

కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రత్యేక హోదా వస్తుందన్నారు. హోదా వస్తే పరిశ్రమలు వస్తాయని, రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని, పోలవరం పూర్తి కావాలన్నా, అమరావతి నిర్మాణం జరగాలన్నా, వైజాగ్ స్టీలు ప్లాంటు ప్రైవేటీకరణ ఆగాలన్నా , కడప స్టీలు ప్లాంటు నిర్మాణం జరగాలన్నా కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. కడప పార్లమెంటు సభ్యురాలిగా తనను, బద్వేలు నియోజకవర్గ ఎమ్మెల్యేగా విజయజ్యోతిని గెలిపించాలని కోరారు. బద్వేలు ఎమ్మెల్యే రబ్బర్‌స్టాంపుగా మారారని, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి తన అనుచరులు బద్వేలు నియోజకవర్గంలో భూ ఆక్రమణలకు పాల్పడడం తప్ప బద్వేలు అభి వృద్ధి గురించి పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో బద్వేల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్‌డీ విజయజ్యోతి, మాజీ ఎమ్మెల్యే కమలమ్మ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



కమలాపురం నియోజకవర్గం 45వ డివిజన్ ఊటుకూరులో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ



అభివాదం చేస్తున్న మాధవీరెడ్డి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీనివాసరెడ్డి



శ్రీనివాసరెడ్డికి ఆహ్వానం పలుకుతున్న టీడీపీ శ్రేణులు



ఎన్నికల ప్రచారంలో మాధవీరెడ్డి, టీడీపీ శ్రేణులు

ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనుకూలంగా టీడీపీ

- అధికారంలోకి వచ్చిన వెంటనే ఐఆర్ ప్రకటన
- సీపీఎస్, జీపీఎస్‌లపై పునఃసమీక్ష
- కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి, పొలిట్ బ్యూరోసభ్యుడు శ్రీనివాసరెడ్డి





టీడీపీలో చేరిన 22వ డివిజన్‌వాసులతో టీడీపీ కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి... విక్టరీ గుర్తు చూపుతున్న కార్యకర్తలు, మాధవీరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), మే 1 :ఐదేళ్ల పాలనలో ప్రధాన వ్యవస్థలు విధ్వంసం అయ్యాయి. ముఖ్యంగా ఉద్యోగ ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వారి గౌరవాన్ని పునః ప్రతిష్ఠ చేసి పూర్తి అనుకూలమైన వాతావరణం టీడీపీ కల్పిస్తుందని టీడీపీ కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి, .జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులరెడ్డి అన్నారు. బుధవారం కడప నగరం 25వ డివిజన్‌లో బండి బాబు ఆధ్వర్యంలో టీడీపీ కళ్యాణమండం నుంచి ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకివచ్చిన వెంటనే ఉద్యోగులకు మెరుగైన పీఆర్‌సీ అమలు చేస్తామన్నారు. అలవెన్స్ పేమెంట్స్‌పై కూడా పునఃపరిశీలన చేస్తారని తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఐఆర్ ప్రకటించడం జరుగుతుంన్నారు. రాష్ట్రంలోని ఉద్యోగులకు,. పెన్షనర్లకు ప్రతి నెలా 1వతేదీన జీతాలు చెల్లిస్తామని రావలసిన బకాయిలు కూడా చెల్లించే ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. పెన్షనర్స్ కార్పొరేషన్ ఏర్పాటు దిశగా చర్యలుతీసకఉంటామన్నారు.,తక్కువ జీతాలు పొందే అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కన్సలిడేటెడ్ ఉదష్యగులకు ప్రభుత్వ పథకాలు వర్తించేఆ చర్యలు చేపడతఆమన్నారు. అలాగే వలంటీర్లకు గౌరవ వేతనం రూ.5వేల నుంచి పదివేలకు పెంచేదుకు చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవుల్లో 34 శాతం బీసీలకు కల్పించడం జరుగుతుందన్నారు. చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కోసం తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తామన్నారు. తక్కువ జనాభాతో ఎన్రికల్లో పోటీ చేయలేని వర్గాలకు నామినేషన్ల ద్వారా రాజకీయ భాగస్వామ్యం కల్పిస్తామన్నారు. బీసీల ఆర్థికాభివృద్ధి, ఉపాధికి ప్రోత్సాహకాలు పునరుద్ధరిస్తామని దామాషా ప్రకారం కార్పొరేషన్లకు నిధులు స్వయం ఉపాధికి ఐదేళ్లలో పదివేల కోట్లు వ్యయం చేస్తామని తెలిపారు. ఐదు వేల కోట్లతో ఆదరణ పథకం పునరుద్ధరిస్తామన్నారు. అలాగే శాశ్వత కుల ధృవీకరణ పత్రాలు అందిస్తామని యాదవ, కురభ అత్యాధునిక ప్రమాణాలతో గొర్రెల పెంపకం, యూనిట్ల స్థాపనకు రాయితీలలు, గొర్రెలు మేకల పెంపకం యూనిట్లకు బీమ కల్పిస్తామన్నారు. చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ రీయింబర్స్‌మెంటు చేస్తామనిపవర్‌లూమ్‌లకు 500 యూనిట్లకు హ్యాండ్‌లూమ్‌కు 200 యూనిట్లు కల్పిస్తామన్నారు. నాయీ బ్రాహ్మనులకు దేవాలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు 25వేలు గౌరవవేతనం, షాపులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తామన్నారు. గీత కార్మికులకు మద్యం షాపుల్లో పది శాతం కేటాయింపులు చేస్తామన్నారు. వడ్డెర్లకు సంబంధించి క్వారీల్లో 15 శాంం రిజర్వేషన్, రాయల్టీ, ప్లీనరీ ఛార్జీల్లో మినహాయింపు కల్పిస్తాఃమన్నారు. అలాగే మత్స్యకారులకు సముద్రంలో వేట విరామం సమయంలో 20వేలు ఆర్థికసాయం అందిస్తామన్నారు. పండుగ కానుకలు, పెళ్లి కానుకలు పునరుద్ధరిస్తామన్నారు. పాడి రైతులకు సంబంధించి పశువుల కొనుగోలుదాణా, మందుల కొనుగోలుపై సబ్సిడీ, ఇన్సురెన్స్ సౌకర్యం, గోకులాల ఏర్పాటు, మేత కోసం బంజరు భూములు కేటాయింపు చేస్తామన్నారు. గోపాలమిత్రల పునర్‌నియామకం దిశగా చర్యలు చేపడతామన్నారు. ఎస్సీ ఎస్టీ సంక్షేమానికి సంబంధించి జిల్లాల వారీగా ఎర్గీకరణ అమలు చేస్తామన్నారు. ఎస్సీ ఎస్టీలకు 50 ఏళ్లకే పింఛను మంజూరు చేస్తామన్నారు. సబ్ ప్లాన్ నిధులు వారి అభివృద్ధికే ఖర్చు చేస్తామని ఏజన్సీల్లో ఆదివాసీ ఉపాధ్యాయుల నియామకం, జీవో 3 పునరుద్ధరణ, ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసిన ఎస్సీ ఎస్టీ సంక్షేమ పథకాల పునరుద్ధరణ చేస్తామన్నారు. డాక్టర్ సుధాకర్,డ్రైవరు సుబ్రమణ్యం, మన్సుర్‌బాయి, డాక్టర్ అచ్చెన్న తదితర హత్యలకు కారకులను కోర్టుల్లో శిక్ష పడే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఎస్సీ ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. ముస్లిం మైనార్టీల సంక్షేమానికి సంబంధించి ముస్లిం మైనార్టీలకు 50 ఏళ్లకే పెన్షన్ అందిస్తామన్నారు. మైనార్టీలకు ముఖ్య పట్టణాల్లో ఈద్గాలకు, కబరుస్తానాలకు స్థలాలు కేటాయించడం జరుగుతుందన్నారు. విజయవాడ సమీపంలో హజ్ హౌస్ నిర్మిస్తామన్నారు.నూర్‌బాష కార్పోరేషన్ ఏర్పాటు చేసి ప్రతి ఏటా నిధులు కేటాయింపు చేసి మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా వారకివడ్డీ లేని రుణాలు ఇస్తామాన్నరు. ఇమాం మౌజన్లకు ప్రతి నెలా పదివేల నుంచి రూ.5వేలు గౌరవ వేతనం ఇస్తామన్నారు. అర్హత గల ఇమాంలను ప్రభుత్వ ఖ్వాజీలుగా నియమిస్తామని, మసీదుల నిర్వహణకు ప్రతి నెలా 5వేలు ఆర్థిక సాయం హజ్‌యాత్ర వెళ్లే ఒక్కో ముస్లింలకు లక్ష సాయం చేస్తామన్నారు. అలాగే కేజీ నుండి పీజీ వరకు సిలబస్‌ను రివ్యూ చేస్తామన్నారు. రాష్ట్రంలో అనేక స్కూళ్లు మూతబడడానికి కారణమైన జీవో 117 రద్దు చేసి మూతబడిన పాఠశాలలను పునః ప్రారంభిస్తామన్నారు. డాక్టర్ అంబేద్కర్ విదేశీ విద్య పథకం పునరుద్ధరిస్తామని తెలిపారు. సహజ మరణానికి చంద్రన్నబీమా పథకం 5 లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే 10 లక్షలు బీమా కల్పిస్తారన్నారు. వైద్యఆరోగ్యగానకి సంబంధించి దేశంలోనే మొట్టమొదటిసారిగా రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి 25 లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తున్నట్లుతెలిపారు. ప్రతి పౌరునికి డిజిటల్ హెల్త్‌కార్డులు అన్ని మండల కేంద్రాల్లో జన ఔషధ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. బీపీ, షుగరు వంటి నాన్ కమ్యూనిబుల్ వ్యా ధులకు ఉచితంగా జనరిక్‌మందులు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శిదుర్గాప్రసాద్, టింబర్ డిపో శ్రీను, చెన్నంశెట్టి మురళి కత్తిరవి, రవి, సుబ్బయ్య, జనసేన నాయకులు తుంగా రమణయ్య, రంజిత్, మహేశ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

34వ డివిజన్‌లో...

34వ డివిజన్‌లో టీడీపీ నాయకులు ఇంతియాజ్ ఆధ్వర్యంలో వారికి టీడీపీ పొలిట్‌బ్యూరోసభ్యులు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి టీడీపీ కండువా వేసి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ టీడీపీవిజయానకి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. టీడీపీలో చేరిన వారు ఎస్ఎండి ఫరూక్, షేక్ షకీల్, సయ్యద్ జిలాన్, గౌస్ బాషా, నాయబ్, శ్రీనివాసులు, బాలక్రిష్ణ, సుబ్బయ్య, జహీర్‌లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మన్సూర్ ఆలీఖాన్, జావీదు, బుఖారితో పాటు స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

22వ డివిజనులో...

కడప నగరం ద్వారకనగర్ టీడీపీ పొలిట్ బ్యూరోసభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి నివాసంలో బుధవారం 22వ డివిజన్ టీడీపీ నాయకులు పల్లా రాము ఆధ్వర్యంలో 150 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి కార్యకర్త ఒక సైనికునగా పనిచేసి ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు

కడప నగరం 34వ డివిజన్‌లో బాషా మొయిద్దీన్ ఆధ్వర్యంలో వైసీపీ నుంచి భారీ సంఖ్యలో టీడీపీలోకి చేరారు. వారికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పార్టీ కం డువావేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గఫూర్, ఇమ్రాన్, మహ్మద్ నవాజ్, షమీర్, హబీబ్, మునీర్, గౌస్ బాషా, ఆజాం, అఖిల్, సోను, ఆరిఫ్, బాషా, అఫ్జన్ తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు సభాస్థలాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాసరెడ్డి

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలి

- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప నగరంలో చేపట్టే సభను జయప్రదం చేయాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడిష్డ, గోవర్ధనరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కడప సెవెన్‌రోడ్స్‌లో పర్యటన సందర్భంగా అధికారులతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అక్కడ చేపట్టబోయే కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యం

- పులివెందులలో సాయుధ బలగాలతో కవాతు



పులివెందులలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పులివెందుల టౌన్, మే 1: ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు తాము ఉన్నామంటూ పులివెందులలో బుధవారం కేంద్ర మరియు రాష్ట్ర సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని పూలంగళ్ల సర్కిల్ నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయం మీదుగా పాతబస్టాండ్ వరకు కవాతు నిర్వహించారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు ప్రజల్లో భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఐ శంకర్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ సురేష్ రెడ్డి, సీఐ శ్రీనివాసనాయక్, ఎస్ఐ అరుణ్‌రెడ్డి, తొండూరు ఎస్ఐ లక్ష్మీనారాయణ, వేముల ఎస్ఐ ధనుంజయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి ఆర్థిక నేరగాడు: టీడీపీ

కడప (మారుతీనగర్), మే 1: రాష్ట్ర ప్రజలను బ్యాంకులకు తాకట్టు పెట్టి ధనార్జనే ధ్యేయంగా పాలన సాగిస్తున్న బడా ఆర్థిక నేరగాడు మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు ఆరోపించారు.. బుధవారం యర్రముక్కపల్లె టీడీపీ నగర శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్టాన్ని రావణకాష్టం చేసి అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందుల పాలుచేయడమే ధ్యేయం గా వైసీపీ నేతలు పాలన సాగిస్తున్న తీరు దారుణమన్నారు. ఇదిలావుండగా రానున్న 30 సంవత్సరాలు తానే ముఖ్యమంత్రి ననే అహంతో సవాలక్ష తప్పుడు పనులు చేయడంతో పాటుగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేసిన జగన్‌రెడ్డి మన రాష్ట్రానికి పట్టిన శని అన్నారు. మరో సారి జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితే ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోతుందనే సంగతి ప్రజలు విజ్ఞతతో ఆలోచించి తన్నె దున్నపోతు లాంటి జగన్ రెడ్డిని ఓడించి పాలిచ్చే ఆవు లాంటి చంద్రన్న గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత కలదన్నారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు వై. బెస్త సుబ్బరాయుడు, నాయకులు శ్రీనివాసులు, పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం అయితే ఉజ్వల భవిష్యత్తు



ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని తాళ్లమాపురంలో టీడీపీ మేనిఫెస్టోను ఓటర్లకు అందిస్తున్న భూపేష్‌రెడ్డి



కమలాపురం మండలంలోని నల్లింగాయపల్లెలో ప్రచారం చేస్తున్న భూపేష్‌రెడ్డి, పక్కన కమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

(కడప - ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం కోసం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన నేత పవన్‌కళ్యాణ్ బీజేపీతో కలిసి అద్భుతమైన మేనిఫెస్టో రూపొందించారని, చంద్రబాబు సీఎం అయితే పేదలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని తాళ్లమాపురం, కమలాపురం నియోజకవర్గంలోని నల్లంగాయపల్లెలో ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు అభ్యర్థి వరదరాజులరెడ్డి, కమలాపురం అభ్యర్థి పుత్తా చైతన్యరెడ్డిని గెలిపించాలని కోరారు. సంక్షేమ పథకాలన్నీ డోర్‌డెలివరీ అవుతాయని, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. కడప పార్లమెంటుకు సైకిలు గుర్తుపై అసెంబ్లీ అభ్యర్థులకు, బీజేపీ పోటీ ఉన్న చోట అసెంబ్లీకి కమలంకు పార్లమెంటుకు సైకిలు గుర్తుకు ఓటు వేయాలని భూపేష్‌రెడ్డి ఓటర్లను విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు సీఎం అయితే ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతుంది. ఇంట్లో ఎంత మంది ఉన్నా సరే తల్లికి వందనం ద్వారా ఒక్కొక్కరికి 15వేలు 18 సంవత్సరాలు నిండిన మహిళలకు 1500, పేదలకు ఉచితంగా గ్యాస్‌సిలిండర్లు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, వంద శాతం వైకల్యం ఉన్న వారికి పింఛను రూ.15వేలు, ఇంకా పింఛన్‌ను రూ.3వేల నుంచి నాలుగువేలకు పెంచడం, రైతులకు ఏడాదికి రూ.20వేలు, ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు, పేదలకు అన్నాక్యాంటిన్లు, ఉచిత ఇసుక, నిరుద్యోగులకు రూ.3వేలు భృతి ఇస్తామన్నారు. ఈసారి నాకు అవకాశం ఇవ్వండి, కడప అభివృద్ధి కోసం పాటుపడతా. స్టీలు ఫ్యాక్టరీ కోసం నిర్మాణం పూర్తిచేస్తా. మీ అందరి బాగోగులు చూస్తానని విజ్ఞప్తి చేశారు.

కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి





పులివెందుల : జెండాను ఎగురవేస్తున్న గఫూర్ తదితరులు... కడపలో జెండాను ఆవిష్కరిస్తున్న వేణుగోపాల్

పులివెందుల రూరల్, మే 1: అన్ని రంగాలలోని కార్మికులంతా కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీఐటీయూ పులివెందుల డివిజన్ కార్యదర్శి గఫూర్ అన్నారు. బుధవారం స్థానిక గఫూర్ డ్రైవింగ్ స్కూల్ వద్ద సీఐటీయూ జండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అంగన్వాడీ నాయకురాల్లు సలీమా, సుధ, పద్మ, కళావతి, రామాంజనమ్మ, కిరణ్మయి, రిబికా, శాంతి, స్వరూప, సుజాత, శివమ్మ, పద్మావతి పాల్గొన్నారు.

కడప నగరంలో...

కడప (మారుతీనగర్), మే 1:ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ మేడే జెండాను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ హమాలీ, ఆటో ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ప్రధానంగా ఆశా, అంగన్వాడీ, మిడ్‌డే మీల్స్, గురుకుల్, స్కూల్ స్లీపర్స్‌కు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి. సుభాషిని, జిల్లా ప్రధాన కార్యదర్శి కె. కల్పన, కోశాధికారి అమ్ములు, నగర ప్రధానకార్యదర్శి శాంతమ్మతో పాటుగా ఏఐటియూసి నాయకులు బాదుల్లా, చంద్రశేఖర్, లక్ష్మీభవాని, హేమ, సరస్వతి, నాగేశ్వరి ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో...

వేంపల్లెలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వేంపల్లె అడ్డరోడ్డులోని సర్కిల్‌లో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జెండా ఎగురవేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బల్లారపు రామాంజనేయులు, జిల్లా సంయుక్త కార్యదర్శి ఓబులేస్, జిల్లా ఉపాధ్యక్షుడు బాలాజి, జిల్లా కోశాధికారి నాగేశ్వర రావు, మండల ఉపాధ్యక్షుడు దస్తగిరి, పులివెందుల ఏరియా ఏఐటీయూసీ కార్యదర్శి బ్రహ్మం, పల్లా సుబ్బారావు, చలపతి, మల్లి, కృష్ణయ్య, సిద్దయ్య, వల్లెపు బుజ్జిబాబు, రామాంజనేయులు, చిన్నోడు, శ్రీనివాసులు, దేవరాజు, చిన్నటోపి, రమణ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘం నాయకులు

‘బీటెక్ రవిని గెలిపించండి’

సింహాద్రిపురం, మే 1: పులివెందుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవిని గెలిపించాలని ఆ పార్టీ నాయకులు ఓటర్లను కోరారు. బుధవారం మండలంలోని హిమకుంట్ల గ్రామంలో ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి సోదరుడు మారెడ్డి జయభరత్‌రెడ్డి, టీడీపీ నాయకుడు మాజీ జడ్పీటీసీ పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి, ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

రావులకొలనులో భారతి ప్రచారం

మండలంలోని రావులకొలను గ్రామంలో సీఎం జగన్ భార్య వైఎస్ భారతి ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీ అవినాష్‌రెడ్డి సోదరి స్వేతతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన ఖాదర్‌బాషా

కడప (ఎర్రముక్కపల్లె), మే 1 : కడప నగరం 27వ డివిజన్ గౌస్‌నగర్‌కు చెందిన జేకే యూత్ నాయకుడు ఖాదర్‌బాషా టీడీపీలో చేరారు. బుధవారం కడప నగరం ద్వారకనగర్ టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి నివాసంలో ఖాదర్‌బాషాకు టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అఫ్సర్‌ఖాన్, మన్సూర్ ఆలీఖాన్, జాకీర్ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

కేబుల్ దొంగలను పట్టుకున్న రైతులు

పులివెందుల టౌన్, మే 1: మండలంలోని నల్లపురెడ్డిపల్లె క్రాస్ వద్ద ఉన్న పొలాల్లో మోటర్లకు సంబంధించిన కేబుల్‌ను చోరీ చేస్తుండగా రైతు మునీంద్ర కనుగొని దొంగలను పట్టుకొని తోటి రైతుల సహాయంతో పోలీసులకు అప్పగించారు. బుధవారం సాయంత్రం పొలం వద్దకు వెళ్లేసరికే దొంగలు తన పొలంలోని మోటర్‌కు ఉన్న కేబుల్ వైరును తెంపుకొని వెళ్తుండగా మునీంద్ర చూసి పట్టుకొని తోటి రైతులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు కేబులు దొంగతనాలు చేసే వారిని తమ ఆధీనంలోకి తీసుకుని స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం.

రతనాల వేంకటేశ్వరస్వామికి శ్రవణా నక్షత్ర పూజలు

ప్రొద్దుటూరు టౌన్, మే 1: స్థానిక పాత మార్కెట్‌లోని లలితాదేవి రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రంను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం మహిళలతో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

నిష్పక్షపాత ఎన్నికలే ప్రజాస్వామ్యానికి ఊపిరి

- అరసం జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి



ఎన్నికల భారతం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అరసం జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), మే 1: ప్రజాస్వామ్య మనుగడకు నిష్పక్షపాత ఎన్నికలే ఊపిరి అని ఏపీ అభ్యుదయ రాష్ట్ర అధ్యక్ష వర్గ సభ్యుడు, కడప జిల్లా అరసం అధ్యక్షుడు ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల భారతం పుస్తకం తీసుకువస్తున్నట్లు చెప్పారు. ప్రముఖుల నుండి యువకుల దాకా వివిధ కోణాల్లో రాజకీయాల గురించి ఎన్నికల శైలి గురించి కళాత్మకంగా విమర్శనాత్మకంగా రాసిన కవితలు ఒక పుస్తకంగా రావడం గొప్ప విషయమన్నారు. ఈ కవితా సంపుటి తప్పక ఓటర్లను మేల్కొల్పుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అభ్యుదయ రచయితల సంఘం కడప జిల్లా శాఖ ఇంటాక్ సంయుక్త ఆధ్వర్యంలో మేడే పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నికల భారతం పుస్తకాన్ని ముఖ్యఅతిథిగా హాజరైన ఇం టాక్ జిల్లా కన్వీనరు మానస చిన్నపరెడ్డి ఆవిష్కరించారు. ఎన్నికల ప్రలోభాలకు అతీతంగా జరగాలని ఓటు అమ్ముడుబోతే మనకు గొర్రెలకు పెద్దతేడాలేకుండా పోతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గునిశెట్టిశ్రీనవాసులు, హమీద్ పీరా, డాక్టర్ రంగనాద్, కొండూరు జనార్ధన్, చిట్టిబాబు, భారవి తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి: డీఎస్పీ



దొమ్మరనంద్యాలలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మైలవరం, మే 1: ప్రజలంతా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని జిల్లా అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, జమ్మలమడుగు డీఎస్పీ యశ్వంత్ పేర్కొన్నారు. రానున్న సార్వత్రిక పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని బుధవారం మండల పరిధిలోని దొమ్మరనంద్యాల గ్రామాన్ని పరిశీలించి ప్రజలకు ఓటు హక్కుపై భరోసా కల్పించారు. ఓటు హక్కు ను ప్రశాంత వాతావరణంలో వాడుకోవచ్చున్నారు.మే 13న జరిగే ఎన్ని కల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్‌శాఖ అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ఎన్నికల వేళ ఘర్షణలు, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్లు ఎటువంటి భయానికి లోనుకాకుండా తమ ఓటు హక్కును విని యోగించుకోవాలన్నారు. ట్రైనీ డీఎస్పీ శ్రీకాంత్, మైలవరం ఎస్ఐ రెడ్డి సురేష్, పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

కలసపాడు, మే 1: ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి, ఎంఈవోలు ప్రేమ్‌సాగర్, మస్తాన్‌వళి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో చదువుతూ పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎస్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో కలసపాడు మండల విద్యాశాఖా ధికారి కార్యాలయంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయులు కవిత, ఎస్టీయూ నేతలు సుబ్రమణ్యం, చంద్రహాసరెడ్డి పాల్గొన్నారు.

రామాయణంపై ఉచిత బోధనా తరగతులు

మైదుకూరు, మే 1 : మైలవరం మండల కేంద్రంలోని శివునిమాన్యం వీధిలో ఉన్న వినాయక స్వామి ఆలయంలో విద్యార్థులకు రామాయణంపై ఉచిత బోధనా తరగతులు నిర్వహిస్తున్నారు. 3నుంచి 7వ తరగతి విద్యార్థులకు రామాయణంతో పాటు హనుమాన్ చాలీసా, నిత్య పారాయణం, శ్లోకాలపై ఈనెల 4 నుంచి నెల రోజుల పాటు ఉదయం బోధనా తరగతులు నిర్వహిస్తామని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆర్ఎస్ఎస్ నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులకు చిన్నప్పటి నుంచే రామాయణ, మహాభారతంపై అవగాహన కల్పించినట్లయితే వారిలో నీతి, న్యాయం అలవడుతుందన్నారు.

సైకిలు గుర్తుకు ఓటు వేస్తేనే రాష్ట్రాభివృద్ధి

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి

కమలాపురం రూరల్, మే 1: మన రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే సైకిలు గుర్తుకు ఓటేసి చంద్రబాబు నాయుడిని గెలిపించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని నల్లింగాయపల్లె పంచాయతీ పరిధిలోని భారతి సిమెంటు కాలనీ, అగస్త్యలింగాయపల్లె. జె.కొత్తపల్లె గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి క్రిష్ణచైతన్యరెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. వచ్చే ఎన్నికల్లో కడప ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థి క్రిష్ణచైతన్యరెడ్డిలను గెలిపించాలని కోరారు. అనంతరం పుత్తా నరసింహారెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ నవ రత్నాల పేరుతో ప్రజలను మోసగించారన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా పూర్తిగా నెరవేర్చలేదన్నారు. అమ్మఒడిపేరుతో తల్లులను మోసగించారని, చంద్రబాబు అధికారంలోకి వస్తూనే ఎంత మంది పిల్లలను బడికి పంపించినా అందిరకీ రూ.15వేలతో తల్లికి వందనం పేరుతో తల్లి అకౌంటులో వేస్తారన్నారు. ఈ ప్రభుత్వంలో వైసీపీ కార్యకర్తలు బాగుపడ్డారన్నారు. అన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలంటే టీడీపీకి ఓటు వేసి గెలిపించినప్పుడే మీక లలు నెరవేరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఖాదర్‌బాషా, మల్లారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాఘవరెడ్డి, దివాకర్‌రెడ్డి, జంపాల నరసింహారెడ్డి, కంకర సుబ్బారెడ్డి, వాసుదేవరెడ్డి, ధర్మారెడ్డి, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రి: రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే తెలుగు దేశం పార్టీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి సతీమణి సరళమ్మ, కోడలు శ్రీచైతన్య, పుత్తా లక్ష్మీరెడ్డి సతీమణి హరిత అన్నారు. బుధవారం మండలంలోని మొయిళ్లకాల్వ, రంపతాడు పంచాయతీ పరిధిలోని మమ్ముసిద్దుపల్లె, మిట్టమీదపల్లె, కాండ్లోపల్లె, ఎగువపల్లె, యానాదికాలనీ, జంగంరెడ్డిపల్లె, ఎం.కొత్తపల్లె, రాళ్లపల్లె, అయ్యవారుపల్లె, రంపతాడు, మొయిళ్లకాల్వ గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తే అందించే సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. సంక్షేమ పథకాల మినీ మేనిఫెస్టోను వివరించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించే వ్యక్తులకు ఓటెయ్యాలన్నారు. వ్యవసాయ పనిముట్లు, డ్రిప్ పరికరాలు, బీమా సౌకర్యం టీడీపీతోనే సాధ్యమన్నారు. రైతులకు, మహిళలకు, పించనర్లకు, నిరుద్యోగులకు తదితరులుకు అందించే సంక్షేమ పజథకాలను వివరించారు. కమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పుత్తా కృష్ణచైతన్యరెడ్డిని గెలిపించాలని కోరారు. అలాగే మండలంలోని నందిమండలం పంచాయతీలో పుత్తా నరసింహారెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గంగిరెడ్డి, టీడీపీ నాయకులు విజయసారథిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, మురళి, వెంకటసుబ్బయ్య, పిచ్చిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, సింగపూర్ రాజారెడ్డి, పొలతల దేవస్థానం మాజీ చైర్మన్ శంకర్‌రెడ్డి, అన్నమయ్య, అరవేటి చంద్రారెడ్డి, ఎస్సీ సెల్ రామాంజనేయులు, చీమలపెంట సర్పంచు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీకేదిన్నె: టీడీపీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతోందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, అల్లుడు యశ్వంత్‌రెడ్డి, కుమార్తె దివ్యలు తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం జె.కొత్తపల్లె, జె.నారాయణపురం, జె.కొత్తపల్లె హరిజనవాడల్లో బాబు షూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జె.కొత్తపల్లె దళితవాడలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టే పథకాల పట్ల ప్రజలు రోజు రోజుకు ఆకర్షితులవుతున్నారని, దీంతో తెలుగుదేశంలోకి భారీగా చేరికలు జరుగుతున్నాయన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. చంద్రబాబు ప్రవేశ పెట్టిన సూపర్-6 పథకాలు, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, 18 ఏళ్ల నిండిన మహిళలకు నెలకు రూ.1500, చదువుతున్న ప్రతి బిడ్డకు సంవత్సరానికి రూ.15000, అన్నదాతకు సంవత్సరానికి రూ.20 వేలు పెట్టుబడి, అన్నా క్యాంటిన్ ప్రారంభం, తదితర పథకాలతో ముందుకెళుతుందని, ఈ పథకాలపట్ల ప్రజలు బాగా ఆకర్షితులయ్యారన్నారు. టీడీపీ విజయాన్ని ఎవరు ఆపలేరన్నారు. కార్యక్రమంలో నాయకులు క్రిష్ణారెడ్డి, క్రిష్ణకిశోర్‌రెడ్డి, మోహన్‌బాబు, డి.వి.సుబ్బారెడ్డి, జబీవుల్లా, రెడ్డిబాష, దర్బార్‌బాష, వెంకటసుబ్బయ్య, శివానంద, సుబ్బనరసింహులు, భద్ర, తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు: రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల సంక్షేమమే టీడీపీ ధ్యేయంగా అధికారంలోకి రాగానే పాలన సాగిస్తుందని జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాదర్‌బాషా అన్నారు. చెన్నూరు మైనార్టీ కాలనీలో జిల్లా మైనార్టీ నేత షబ్బీర్‌హుసేన్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి కమలాపురం నియోజకవర్గంలో పుత్తా చైతన్యరెడ్డి గెలుపునకు సైకిలు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. అనంతరం ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలు వివరించారు. సూపర్‌సిక్స్ పథకాలు కూడా వివరించారు. రైతులకు సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు, 9గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా, 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు ముఖ్యంగా ఇప్పుడు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ల్యాండ్ టైటలింగ్ యాక్టు ఖచ్చితంగా రద్దు చేసి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పిస్తాన్నారు. సర్పంచ్‌లకు ఇప్పుడున్న గౌరవ వేతనాన్ని పెంచి ఇస్తారని ఆయన తెలిపారు. పైగా ఎవరూ ప్రవేశపెట్టని విధంగా ఉమ్మడి మేనిఫెస్టోలో ప్రతి కుటుబానికి 25 లక్షల ఆరోగ్య బీమా అమలు చేయడం జరుగుతుందని, ఉచితంగా ఇసుక ఇవ్వడం రైతులకు ఏటా రూ.20 వేలు ఆర్థికసాయంతో పాటు కౌలు రైతులకు కూడా ఆర్థిక సాయం ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే ఇంటింట సంక్షేమ పథకాల కరపత్రాలు అందించారు. ముస్లింల రిజర్వేషన్ కోసం పాటుపడితే వైసీపీ రాజ్యసభ సభ్యుడు క్రిష్ణయ్య అది రద్దు చేయాలని సుప్రీంకోర్టులోరిట్ పిటిషన్ వేసిన విషయం ప్రజలు గమనించాలని టీడీపీ ఎప్పుడూ ముస్లిం మైనార్టీలకు అండగా ఉండి వారి అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనరు విజయభాస్కర్‌రెడ్డి, చెన్నూరు పట్టణ కమిటి అధ్యక్షులు ఆకుల చలపతి, కమలాపురం మాజీ కోప్షన్ సభ్యులు రెడ్డికరీం, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాజాహుసేన్, జిల్లా కార్యదర్శి మంజూరు అహ్మద్, గౌస్‌పీర్, గౌసర్‌ఆలీ, అనిఫ్, జిలానీ, సంధాని, అల్లాబకాష్, దిల్షాద్, రఫీద్దీన్, కరీముల్లాతో పాటు మల్లిఖార్జునరెడ్డి పాల్గొన్నారు.



ఓటరుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కృష్ణచైతన్యరెడ్డి, పక్కన ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి



పుత్తా కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న టీడీపీ అభిమానులు



చెన్నూరు మైనార్టీ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

అరాచక పాలనను అంతమొందిద్దాం

● అభివృద్ధి సంక్షేమ పాలనకు ఓటేద్దాం

● ఎన్‌డీఏ అభ్యర్థుల గెలుపే లక్ష్యం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), మే 1: అరాచక పాలనను అంతమొందించి అభివృద్ధి సంక్షేమ ఫలాలకు ఓటు వేద్దామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి పిలుపునిచ్చారు. ఎన్‌డీఏ కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా చేయి చేయి కలిపి ముందుకు సాగుదామని చెప్పారు. బుధవారం కడప నగరం ద్వారకా నగర్‌లోని వాసు నివాసంలో వారు విలేకరులతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించి అధికారంలోకి రావడం తథ్యమని, చంద్రబాబు దూరదృష్టితో సంపద సృష్టించగలరని కూటమి అభ్యర్థులతోనే ప్రజాపాలన లభిస్తుందన్నారు. కూటమి తాజాగా విడుదల చేసిన ప్రజా మేనిఫెస్టోపై వివరించారు. అదే విధంగా గురువారం జరగబోవు ప్రజాగళం సమావేశం ఏడు రోడ్ల కూడలి వద్ద జరుగుతుందని టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు ప్రజలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు. సంక్షేమ పాలనకు ఓటు వేయాలని టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎన్‌డీఏ కూటమితోనే అద్భుతమైన మేనిఫెస్టో రూపొందించారని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. మేనిఫెస్టో ప్రకారం అయితే ప్రతి ఒక్క పేద ప్రజలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలతో పాటు సంక్షేమ కార్యక్రమాలు అమలవుతాయన్నారు. అర్హత కలిగిన ప్రతి మహిళకు మూడు ఉచిత సిలిండర్లు, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, కుటుంబంలో ఎంత మంది విద్యార్థులు చదువుతుంటే వారికి ఏడాదికి రూ.15వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. మహిళలకు 1500, రైతులకు 20 వేలు, నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు భృతి, ఈ విధంగా సంక్షేమ పథకాలు అన్నీ కూడా అమలు చేస్తామన్నారు. నగరంలో తాగునీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయరంగాన్ని అట్టడుగున దిగజార్చిన వ్యక్తి కేవలం వైఎస్ జగన్ అని చెప్పారు. హిందూపురం ఎంపీ నిమ్మల క్రిష్టప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ చంద్రబాబు బహిరంగ సభలు జరుగుతున్నా ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. వైసీపీకి ఎందుకు ఓటు వేయాలో చెప్పాలని ప్రశ్నించారు. గతంలో కేసులు బయటపడేందుకా లేదా వివేకా కేసులో తన అనుచరులు, తన బంధువర్గం బయట పడేందుకా అని ప్రశ్నించారు. 25 ఎంపీ సీట్లు ఇస్తే కేంద్రం మెడలు వంచుతానని ఈ రోజు కేంద్రం వద్ద మోకాలిపై కూర్చున్న పరిస్థితి వచ్చిందన్నారు. అప్పుల ఊబిలో ఆంధ్రరాష్ట్రం కూరుకుపోయిందన్నారు. దీన్ని మళ్లీ సక్రమమైన మార్గంలో పెట్టాలంటే సమర్థుడైన నాయకుడు చంద్రబాబు మాత్రమేనన్నారు. కూటమి వస్తే చంద్రబాబు పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలోకి ముందుకు వెళ్తుందన్నారు. రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని, రాష్ట్ర సంపద ఎలా పెంచాలో తెలిసిన ఏకైక వ్యక్తి చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సుధా దుర్గాప్రసాద్, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి, టీడీపీ నాయకులు కత్తి రవీంద్ర, వెంకటరమణయ్య, జనసేన నాయకులు తుంగా రమణయ్య, కాపు సంఘం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేసుదాసు, ప్రకాశ్, రామ్మూర్తి, బండి బాబు, చలపతి, జగదీష్, సుబ్రమణ్యం, రెడ్డిపల్లె మహేష్‌బాబు, రమణతో పాటు జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి, చిత్రంలో మాధవిరెడ్డి, తదితరులు

అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలి

● డాక్టర్ వైఎస్ సునీత

చెన్నూరు, మే 1: కమలాపురం నియోజకవర్గంలో ఇండియా కూటమి అభ్యర్థిగా పోటీలో ఉన్న సీపీఐ అభ్యర్థి గాలిచంద్ర, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిలారెడ్డిని గెలిపించేందుకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో గట్టి కృషి చేయాలని, అలాగే చెన్నూరు మండలంలో విస్తృత ప్రచారం చేసి ప్రజలకు ఇండియా మేనిఫెస్టో వివరించాలని డాక్టర్ వైఎస్ సునీత కమలాపురం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ పొట్టిపాటి చంద్రశేఖర్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు చెన్నూరులో బుధవారం ఆయన స్వగృహంలో కాంగ్రెస్ పార్టీకి, అలాగే చెన్నూరు మండలంలో మంచి మెజార్టీ కోసం చేపట్టాల్సిన ప్రచారం గురించి మాట్లాడారు. ఇప్పుడు జరిగే ఎన్నికలు ఎంతో కీలకమని, న్యాయానికి-అన్యాయానికి, ధర్మానికి-అధర్మానికి మధ్య పోటీ జరుగుతున్నందున ప్రజలంతా న్యాయం, ధర్మం వైపు నిలబడేలా ప్రతి కాంగ్రెస్ నేత, కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. అనంతరం మాజీ ఎంపీపీ శివరామిరెడ్డి ఇంటికి వెళ్లి కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని, తన తండ్రి వివేకా గురించి మీకందరికీ తెలిసినందున అలాంటి కుటుంబానికి అండగా ఉండి తప్పకుండా సహకారం అందించాలని కోరారు. మైనార్టీ సెల్ మండల శాఖ అధ్యక్షుడు సంధాని బాషా పాల్గొన్నారు.



చెన్నూరులో పొట్టిపాటి చంద్రశేఖరరెడ్డిని కలిసిన వైఎస్ సునీత

ప్రలోభాలకు తెరలేపిన వైసీపీ





వైసీపీ, ఎన్డీఏ కూటమి నేతల మధ్య వాగ్వాదం, ముఖాలకు కొంగు కప్పుకుని పారిపోతున్న యానిమేటర్లు

● మెప్మా యానిమేటర్లతో రహస్య సమావేశం

బద్వేలు, మే 1: సార్వత్రిక ఎన్నికలలో వైసీపీ గెలిచేందుకు అడ్డదారులు తొక్కుతోంది. ఎన్నికల నిబంధనలు తమకు వర్తించవన్న రీతిలో వైసీపీ నేతలు వ్యవహరిస్తున్నారు. బుధవారం వైఎస్సార్ కడప జిల్లా బద్వేలులో వైసీపీకి చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్ కళాశాలలో మెప్మా యానిమేటర్లతో రహస్య సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 2వేలకు పైగా డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల్లోని మహిళా ఓట్లు వైసీపీకి పడేలా చేసేందుకు యానిమేటర్లతో సమావేశం నిర్వహించారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి సుధ, కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్ గురుమోహన్, బద్వేలు మున్సిపల్ వైస్‌చైర్మన్ సాయిక్రిష్ణ హాజరయ్యారు. డ్వాక్రా గ్రూపు సభ్యులందరితో వైసీపీకి ఓట్లు పడేలా చేయాలని యానిమేటర్లను. తిరిగి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మీకు అన్ని విధాలా లబ్ధి చేకూరుస్తామని, ప్రస్తుతానికి నగదు రూపంలో లేదా వస్తు రూపంలో అందజేస్తామని చెప్పారని విశ్వసనీయ సమాచారం. ప్రైవేటు కళాశాలలో యానిమేటర్లతో రహస్య సమావేశం నిర్వహిస్తున్నారని తెలుసుకున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగళరెడ్డి, మిత్తికాయల రమణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డితో పాటు పలువురు నేతలు, కార్యకర్తలు కళాశాల వద్దకు చేరుకున్నారు. కొద్దిసేపు వీరికి, వైసీపీ నేతలకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో యానిమేటర్లు ముఖాలకు ముసుగులు వేసుకుని అక్కడి నుంచి పారిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాల వారికి సర్ది చెప్పడంతో సమస్య సద్దుమణిగింది. ఈ సందర్భంగా కూటమి నేతలు మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నప్పటికీ వైసీపీ నేతలు కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తొలి మహిళావధాని ప్రభావతి మృతి తీరని లోటు

కడప(కల్చరల్), మే 1. ఆంధ్రదేశంలో తొలి మహిళావధానిగా పేరుగాంచిన మడకశిర కృష్ణ ప్రభావతి (78) విజయవాడలో మరణించడం సాహితీ జగత్తుకే తీరని లోటని మహా కవయిత్రి మొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, ప్రముఖ సాహితీవేత్తలు సుబ్బరాఘవరాజు, జింకా సుబ్రమణ్యం, పద్యకవి కె.గురుమూర్తి ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. రాష్ట్ర, రాష్ట్రేతరాలలో శతాధిక అవధానాలను పండిత పామర జనరంజకంగా నిర్వహించి పలువురి ప్రశంసలకు పాత్రులయ్యారన్నారు. గుంతకల్లుకు చెందిన ఆమె పదికి పైగా రచనలు చేసి రైల్వే జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పదవీ విరమణ చేశారన్నారు. ఆమె ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారన్నారు. 2020 సంవత్సరంలో కడప కళాక్షేత్రంలో జరిగిన మొల్ల సాహితీ జయంతి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరై మొల్ల సాహితీ సేవా పురస్కారాన్ని అందుకున్నారని గుర్తు చేశారు.



ప్రభావతి (ఫైల్)

నిందితుడికి 6 నెలల జైలు శిక్ష

మైలవరం, మే 1: ద్విచక్ర వాహనంలో వేగంగా వెళ్తూ ఓ వ్యక్తిని ఢీకొన్న ఘటనలో నార్జాంపల్లికి చెందిన అన్నెబోయిన ఉపేంద్ర అనే యువకుడికి 6 నెలల జైలు శిక్ష విధించినట్లు బుధవారం జమ్మలమడుగు కోర్టు జడ్జి తీర్పు వెల్లడించినట్లు మైలవరం ఎస్ఐ రెడ్డిసురేష్ తెలిపారు. 2018 సంవత్సరంలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి కోర్టు తీర్పు వెల్లడించింది. ద్విచక్ర వాహనంలో నార్జాంపల్లి చెందిన అన్నెబోయిన ఉపేంద్ర అనే యువకుడు వేగంగా వెళ్తూ దొమ్మరనంద్యాల గ్రామానికి చెందిన నీలూరు కుమ్మరి దశరథకుమార్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో దశరథకుమార్ మృతి చెందడంతో మైలవరం పోలీస్ స్టేషన్లో 2018లో కేసు నమోదైంది.

హౌసింగ్ బోర్డు కాలనీలో చోరీ

● 13 తులాల బంగారు అపహరణ

కడప (క్రైం), మే 1: కడప నగరం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఓ ఇంట్లో దొంగలు పడి 13 తులాల బంగారు నగలను అపహరించినట్లు వన్‌టౌన్ సీఐ రంగస్వామి తెలిపారు. సీఐ వివరాల మేరకు... హౌసింగ్ బోర్డులో నివాసం ఉంటున్న సరోజారెడ్డి గత నెల 27న తమ కుటుంబ సభ్యులతో లక్కిరెడ్డిపల్లెకు వెళ్లి తిరిగి బుధ వారం ఇంటికొచ్చారు. ఇంటి తాళాలు పగలగొట్టి ఉండ టంతో అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు 13 తులాల బంగారు చోరీ అయినట్లు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ మృతి కేసులో ముగ్గురు అరెస్టు

కడప (క్రైం), మే 1: కడప నగరం సాగర్ కాలనీలో గత నెల 22న ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో ఆ వివాహిత భర్త, అత్తమామలను బుధవారం పాత బైపాస్ వద్ద అరెస్టు చేసినట్లు రిమ్స్ సీఐ రామచంద్ర తెలిపారు. సీఐ వివరాల మేరకు.. కర్నూలుకు చెందిన లతిక మృతికి కారకులైన ఆమె భర్త సాయికుమార్, అత్తామామ పద్మ, లింగన్నలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), మే 1: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఆయా పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని కేటాయించే రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను సజావుగా పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయ రామరాజు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎస్‌పిసీ హాలులో ఎన్నికల సాధారణ పరిశీలకులు కునాల్ సిల్కు, భానుదాస్ పాలవె పర్యవేక్షణలో జేసీ గణేష్ కుమార్, నగరపాలక కమిషనరు ప్రవీణ్‌చంద్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయపార్టీల ప్రతినిధుల సమక్షంలో ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్ణయించిన నిర్దీత సమయంలో పకడ్బందీగా ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టామన్నారు. ముందుగా పార్లమెంటరీ నియోజకవర్గం, అనంతరం 7 అసెంబ్లీ నియోజకవర్గాల పోలింగ్‌స్టేషన్ల వారీగా ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల ర్యాండమైజేషన్ పూర్తి చేశామన్నారు. ఎన్నికల యంత్రాలను తరలించే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ ఉంటుందని, సెక్యూరిటీ, ప్రోటోకాల్ ప్రకారం పటిష్ట పోలీసు బందోబస్తుతో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పోలింగ్ కేంద్రాలకు యంత్రాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. సమావేశంలో అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


వైవీయూ సెమిస్టర్ల పరీక్ష ఫలితాలు విడుదల

కడప(ఎర్రముక్కపల్లె), మే 1: వైవీయూ పోస్టుగ్రాడ్యుయేషన్ 1, 3 సెమిష్టరు పరీక్షల ఫలితాలను వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్, రిజిస్ట్రారు వైపీ వెంకటసుబ్బయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్.ఈశ్వర్‌రెడ్డి బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ చింతా సుధాకర్ మాట్లాడుతూ ఎంఏ మూడో సెమిస్టరు తెలుగు, ఇంగ్లీషు, హిస్టరీ పీఎస్ అండ్ పీఏ ఎకనామిక్స్ ఉర్దూ ఎంకామ్, అలాగే ఎంఎస్‌సీ బయోకెమిస్ట్రీ, బోటనీ, ఎన్విరాన్‌మెంటు సైన్స్ ఫుడ్ టెక్నాలజీ జెనిటిక్స్ జియాలజీ ఫిజిక్స్, సైకాలజీ, జువాలజీ, ఫిజికల్ ఎడ్యుకేషన్, మైక్రోబయాలజీ సబ్జెక్టుల్లో వందశాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. ఎంఏ ఫస్ట్ సెమిస్టరు తెలుగు, ఇంగ్లీషు, హిస్టరీ ఎకనామిక్స్, ఉర్దూ ఎంకామ్ కోర్సుల్లో వంద శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. అలాగే ఎంఎస్‌సీ ఫస్ట్ సెమిస్టరులో ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫుడ్‌సైన్స్, జియాలజీ, సైకాలజీ ఎంపీఈడీ కోర్సుల్లో వందశాతం ఫలితాలు వచ్చాయన్నారు. మిగిలిన కోర్సుల్లో వందశాతం లోపు ఫలితాలు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు తెచ్చినందుకు ఆయా శాఖల అధ్యాపకులకు పరీక్ష ఫలితాలు సకాలంలో విడుదల చేసిన పరీక్షల విభాగాన్ని ఆయన అభినందించారు. కార్యక్రమంలో సహాయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ మమత, చీఫ్ ఇంజనీరు రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



పీజీ ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రారు తదితరులు

సొంతింటి కల కలేనా...?


నీళ్లు లేక ఆగిపోయిన ఇంటి నిర్మాణాలు

సమస్యల వలయంలో జగనన్న కాలనీలు ● నీళ్లు లేక ఆగిన నిర్మాణాలు
● లబ్ధిదారులే బోరు రిపేరు చేయించుకున్న వైనం
జగనన్న కాలనీలకు వసతులు నిల్ ● ఆగ్రహిస్తున్న లబ్ధిదారులు

జమ్మలమడుగు, మే1: 'రాష్ట్రంలో ప్రతి నిరుపేదకూ సొంత ఇంటి కల నెరవేరుస్తామని, అన్ని వసతులూ కలిగిన ప్రాంతాన్ని ఎంపికచేసి ఇంటి నిర్మాణాలు చేపడతామని' ప్రతిపక్ష నేత హోదాలో జగన్ మోహన్ రెడ్డి ప్రతి సభలోనూ ఊదరగొట్టారు. దీన్ని నమ్మిన పేదలు గంపగుత్తగా ఓట్ల వర్షం కురిపించారు. అధికారం చేపట్టి సీఎం హోదాలో జగన్ సొంత ఇంటి కల నెరవేర్చేందుకు తమ అనుయాయులకే లబ్ధి చేకూరేలా ప్రణాళికలు రూపొందించారు. దీంతో రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో జగనన్న లేఔట్లు తయారు చేశారు. స్థలాలు దొరక్క పోవడంతో కొందరు స్థానికుల స్థలాలను సైతం ప్రభుత్వమే కొనుగోలుచేసి వాటిని లేఔట్లుగా రూపొందించి పేదలకు పట్టణంలో అయితే ఒక్కొక్కరికి సెంటు, గ్రామాల్లో ఒకటిన్నర సెంటు స్థలం కేటాయించారు. ఇంత వరకుబాగున్నా ఇంటి నిర్మాణానికి రూ.1.80లక్షలు ప్రభుత్వమే ఇస్తుందని నమ్మబలికి మొదట మీసొమ్ముతో ఇంటి నిర్మాణం చేపడితే అంచెలంచెలుగా డబ్బు లబ్ధిదారుడి ఖాతాలో వేస్తామని ప్రకటించారు. నిరుపేదలకు సొంత ఇంటి కల నెరవరుస్తామని ప్రగల్భాలు పలికిన జగనన్న చివరకు ఇంటి నిర్మాణం విషయంలో ప్రభుత్వం చేతులెత్తేసిందని పలువురు నిరుపేదలు వాపోతున్నారు. కనీస మౌలిక సదుపాయాలు సైతం కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. ఫలితంగా జగనన్న కాలనీలు సమస్యలవలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. వివరాల్లోకెళితే...

నియోజకవర్గంలోని జగనన్న కాలనీలుగా లబ్ధిదారులకు లేఅవుట్లు ప్రకటించారు. అప్పటి నుంచి దాదాపు మూడేళ్లు కావస్తున్నా ఇంటి నిర్మాణాల విషయంలో లబ్ధిదారులు ముందుకు రావడంలేదని కొన్ని చోట్ల అధికార పార్టీ నేతలు, కార్యకర్తలు కాంట్రాక్టుల అవతారమెత్తి బేస్‌మెంట్‌ల వరకు కొన్ని నిర్మించి బిల్లులు తీసుకున్న తర్వాత కొన్నింటిని కట్టకుండా చేతులెత్తేసినట్లు విమర్శలున్నాయి. జమ్మలమడుగులో అంబవరం జగనన్న కాలనీలో బోలెడు సమస్యలున్నాయి. ఇంటి నిర్మాణానికి నీళ్లు లేవని దాదాపు 10 నెలల నుంచి అధికారులను అడుగుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని లబ్ధిదారుల ద్వారా తెలుస్తోంది. జమ్మలమడుగు జగనన్న కాలనీలో మొత్తం 2,247 గృహాలకు లేఅవుట్ ఉండగా మరికొన్ని పెంచుతూ దాదాపు 800 ఇళ్లకు లేఅవుట్లు ఇచ్చినట్లుగా తెలుస్తోంది. అయితే ఇంటి నిర్మాణం కోసం రూ.1.80 లక్షలు ఏమూలకు చాలదని కొందరు అప్పు చేసి నిర్మించుకుంటుంటే ఫైనల్ బిల్లులే కాదు పాత బిల్లులు కూడా రావడంలేదని లబ్ధిదారులు వాపోతున్నారు.



గ్రావెల్ రోడ్లలో రాళ్లు తేలి పాదచారులకు సైతం ఇబ్బందికరంగా మారింది. నీళ్లలేక మినీ ట్యాంకులు ఎండిపోయాయి. జమ్మలమడుగు జగనన్న కాలనీలో గతంలో వేసిన బోర్లు సైతం నాశిరకమని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. కాలనీలో మొదటి నుంచీ అధికార పార్టీ నేతలు ఎన్ని బోర్లు వేశారు, మరమ్మతులు ఎప్పుడెప్పుడు చేశారో తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు వాపోతున్నారు. నిర్మాణాలు ఆగిపోయి నీళ్ల అడిగితే పట్టించుకోకపోవడంతో పది నెలల కిందట తామంతా ఏకంగా మున్సిపల్ కార్యాలయం వద్దకు వెళ్లి అధికారులను అడిగితే నిధులు లేవని, అప్పటి అధికారులు చేతులెత్తేశారని లబ్ధిదారులు వాపోతున్నారు. చివరకు 12 ఇళ్లకు సంబంధించిన వారంతా కాలనీలో చేరి సొంతంగా చందాలు వేసుకుని బోరు రిపేరు చేయించుకుని నీళ్లను వాడుకుంటున్నట్లు బాధితులు వివరించారు. జమ్మలమడుగు మండలం పొన్నతోట జగనన్న కాలనీలోనూ ఇలాంటి సమస్యలే ఉన్నాయి. రోడ్లు లేవు, కరెంటు సమస్యలు, నీరు, రోడ్ల సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. బోర్లు మరమ్మతులు చేయక ఇబ్బంది పడుతున్నట్లు పలువురు లబ్ధిదారులు తెలిపారు. జమ్మలమడుగు పొన్నతోట కాలనీలో 436 గృహాలకు దాదాపు 10 మాత్రమే శ్లాబ్‌లెవెల్‌కు వచ్చాయని, మిగతావి పూర్తికాలేదని తెలిపారు. మైలవరం జగనన్న కాలనీలో 173 లేఅవుట్లకు ఒక్కటీ పూర్తికాలేదని తెలుస్తోంది. ఈ సమస్యలకు సంబంధించి జమ్మలమడుగు హౌసింగ్ ఏఈ ఓబులేసును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ఫైనల్ బిల్లుల సమస్య ఉందని, లబ్ధిదారులకు నీళ్లు లేవని, మౌలిక వసతులు లేక నిర్మాణాలు పూర్తిగా ఆగిపోయాయని, ప్రస్తుతం సుమారు పది నెలల నుంచి లబ్ధిదారులకు నీళ్లు అందలేదని ఆయన తెలిపారు. 12 మంది లబ్ధిదారులు చందాలు వేసుకుని బోరు రిపేరు చేయించుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పెద్దముడియం మండలంలో హౌసింగ్ ఏఈ సుబ్బరాయుడు మాట్లాడుతూ పెద్దముడియం మండలంలో చిన్న చిన్న లేఅవుట్లు కావడంతో ఇబ్బంది లేదని, మొత్తం 304 గృహాలకు కొన్ని పూర్తయ్యాయని, ఫైనల్ బిల్లులు రావాల్సి ఉందన్నారు. మైలవరం హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు మాట్లాడుతూ 173 లేఅవుట్లకు ఒక్కటి మాత్రమే శ్లాబ్ పడిందని, మిగతావి పూర్తికాలేదన్నారు. రోడ్లు గ్రావెల్ రోడ్లు మాత్రమే ఉన్నాయని, నీటి సరఫరా లేదని లబ్ధిదారులు వివరిస్తున్నారు.


జమ్మలమడుగు జగనన్న కాలనీలో రాళ్లు తేలిన గ్రావెల్ రోడ్డు


మైలవరం జగనన్న కాలనీలో ఆగిపోయిన నిర్మాణాలు


పొన్నతోట జగనన్న కాలనీలో ఆగిపోయిన నిర్మాణాలు

టిక్కెట్టు కోసం గలగలా.. రాక వెలవెల

కిటకిటలాడిన పార్టీ కార్యాలయాలు నేడు మూసివేత ● సర్కస్ కంపెనీల్లా నేతల ఎన్నికల కార్యాలయాలు

రాజంపేట, మే1: సార్వత్రిక ఎన్నికలు వచ్చాయంటే సర్కర్ కంపెనీల్లో రాజకీయ నేతల పార్టీ కార్యాలయాలు కూడా పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తాయి. ఇవి ఆరు నెలల పాటు హడావుడి చేస్తాయి. అందరి దృష్టినీ ఆకర్షిస్తాయి. ఎటువంటి పరిస్థితుల్లోనూ టిక్కెట్ తమకే వస్తుందని ఆశించిన పలువురు నేతలు మొదటి నుంచీ కార్యాలయాలు ఏర్పాటు చేసుకుని లక్షలు ఖర్చు పెడుతూ అవసరం ఉన్నా లేకున్నా ప్రతి ఒక్కరినీ కలుస్తూ అభిమానులు, కార్యకర్తలతో పార్టీ కార్యాలయాలు సందడితో నిండిపోయాయి. చివరకు ఆశించిన వారికి టికెట్టు రాకపోవడంతో పార్టీ కార్యాలయాలను మూసి వేసి నిర్వేదంతో మిగిలిపోయారు. మరికొందరు ఎవరికి టిక్కెట్ ఇచ్చినా వారి కోసం ప్రచారం చేయడం, తమ అనుయాయులను ప్రచారాలకు తిప్పడం కొసమెరుపైంది. వివరాల్లోకెళితే...


వెలవెలబోతున్న మేడా భవన్

రాజంపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీ చేయదలుచుకున్న వారు డజను మంది. ఈ డజను మంది అటు వైసీపీ, ఇటు టీడీపీ తరఫున ఎమ్మెల్యే టికెట్లును ఆశించారు. అతి చిన్నపట్టణమైన రాజంపేటలో 12 రాజకీయ పార్టీలు ఆరు నెలల పాటు దేదీప్యమానంగా వెలుగొందాయి. వారిలో ఇద్దరికి మాత్రమే టికెట్లు లభించడంతో మిగిలిన వారి కార్యాలయాలు మూతపడిపోయాయి. టీడీపీకి ఈసారి ఎక్కువ పోటీ నెలకొంది. టీడీపీ తరఫున పోటీ చేయదలుచుకున్న వారిలో టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, గంటా నరహరి, రాజంపేట నియోజకవర్గ టీడీపీ నేత పోలి సుబ్బారెడ్డి, సిట్టింగ్ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి చిన్నాన్న కుమారుడు, ప్రస్తుత టీడీపీ నేత మేడా విజయశేఖర్‌రెడ్డి (పెదబాబు), జనసేన తరఫున ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మలిశెట్టి వెంకటరమణ, యువనేతలు అతికారి కృష్ణ, అతికారి దినేష్, శ్రీనివాసరాజు, వైసీపీ తరఫున ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, వీరబల్లికి చెందిన మదన్‌రెడ్డి టికెట్ల కోసం పోటీ పడ్డారు. వీరిలో అటు పార్లమెంటుకు, ఇటు అసెంబ్లీకి పోటీ చేయదలుచుకున్న గంటా నరహరి ఆరు నెలల కిందట రాజంపేటలో అట్టహాసంగా విలాసవంతమైన వసతులతో కూడిన భవనాన్ని లాన్‌తో విలాసవంతమైన పార్టీ కార్యాలయంగా రూపొందించారు. అక్కడే తన రాజకీయ కార్యకలాపాలను ఊహించని రీతిలో ఉధృతి చేశారు. తన కార్యాలయం ఎదుట పదుల కొద్దీ వాహనాలు, భారీ హంగామాతో కార్యకర్తలు, రోజుకో కార్యక్రమం ఈ ఆరు నెలలు మూడు పువ్వులు ఆరు కాయలుగా ఆయన రాజకీయ కార్యకలాపాలు సాగాయి. కాగా ఆయనకు ఏ టికెట్టు లభించకపోవడంతో అర్థంకాక పార్టీ కార్యాలయం నామమాత్రంగా తయారైంది. ఆరు నెలలు ఆర్భాటంగా వెలిగిన ఈ గంటా కార్యాలయం నేడు గంట మోగించేవాడు లేక వెలవెలబోతోంది. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి సోదరుడు మేడా విజయశేఖర్‌రెడ్డి ప్రధాన హైవేలో పార్టీ కార్యాలయాన్ని ఆర్భాటంగా ప్రారంభించి పార్టీ కార్యక్రమాలను ఉధృతి చేశారు. టికెట్టు రాకపోవడంతో అది మూతపడింది. పక్కా భవనాలు కలిగిన ఆకేపాటి భవన్, సిట్టింగ్ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డికి చెందిన మేడా భవన్, బీజేపీ పార్లమెంటు అధ్యక్షుడు సాయిలోకేష్ విలాసవంతమైన భవన్‌లు ఎన్నికల ముందర కార్యకర్తలతో ఆర్భాటంగా కనిపించినా ఎమ్మెల్యే టికెట్టు లభించిన ఆకేపాటి భవన్ మినహా మిగిలిన వారి భవన్‌లు వెలవెల పోతున్నాయి.


కార్యకర్తలు లేక బోసిపోయివున్న గంటా మీటింగ్ హాల్


చూపుడాయకంగా మారిన రహస్య రాజకీయ మంతనాల గది


మూతపడిన మేడా విజయశేఖర్ రెడ్డి కార్యాలయం

పనిచేస్తుందా...?

వంద శాతం పోలింగ్‌కు బుడ్డోడి చిట్కా!



కలికిరి, మే 1: ఈ సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ శాతం వంద శాతం పెంచాలని అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఎన్ని అవగాహన కార్యక్రమాలు చేపట్టినా ఫలితం కన్పించడం లేదు. ఈ నేపథ్యంలో షార్ట్ కట్‌గా పోలింగ్ శాతం గణనీయంగా పెంచేందుకు ఎలాంటి అవకాశాలున్నాయో తెలుసుకోవడానికి ఓ జిల్లా కలెక్టరు ప్రయత్నించారు. ఇందులో భాగంగా వందశాతం పోలింగ్ జరిగేందుకు ఎవరైనా సూచనలు చేయాలని ప్రకటిస్తూ మంచి సూచనలకు బహుమతులు కూడా వుంటాయని జిల్లా వ్యాప్తంగా ఆసక్తి వున్న వారు సూచనలు పంపవచ్చని ప్రకటించారు. ఇది తెలిసిన ఓ బుడ్డోడు ఇలా ఓ సూచన పంపించాడు.

అయ్యా.. నా విన్నపాన్ని పాటిస్తే వంద శాతం కాదుగదా 110 శాతం పోలింగ్ అయి తీరుతుంది. పార్టీల అభ్యర్థులు ఓట్ల కోసం ఇంటింటికీ వెళ్లి ఓటుకు రేటు కట్టి పంచుతారు కదా. ఇలా పంచడం తప్పని, వాటిని ఎవరూ అరికట్టలేకున్నారు. ఇప్పుడు దాన్నే మీరూ పాటించండి. ఒక్కో ఓటుకు ఎవరు ఎంత పంచాలనుకుంటున్నారో ఇరువర్గాల వారికీ లెక్కేసి మొత్తం మీ దగ్గర చేర్చమనండి. ఈ డబ్బంతా ఓటర్లను బట్టి బూత్‌లకు చేర్చండి. ఓటేస్తే డబ్బిస్తాం అని చిన్న ప్రకటన చేస్తే చాలు ఓటర్లు క్యూకడతారు. క్యాండిడేట్లు ఇచ్చిన డబ్బును ఆ ప్రకారంగా ఇచ్చేసి పక్కాగా రసీదు తీసుకోండి. దీంతో పిచ్చపిచ్చగా వందశాతం పోలింగు జరుగుతుంది. మరో 10 శాతం జనాలు ఓటేయకుండా ఇంకా బయట మిగిలుంటారు. వీళ్లంతా మామూలుగా ప్రతి ఎలెక్షనుకూ చివర్లో వచ్చి తమ పేర్లు ఓటర్ల లిస్టులో లేవని గగ్గోలు పెడుతుండే వారే. పనిలో పనిగా వీరి పేర్లు కూడా ఓటర్ల జాబితా కోసం రాసి పెట్టుకోండి. వచ్చే ఎలక్షన్‌కు వంద శాతం ఓటర్ల లిస్టు కూడా రెడీ అయిపోతుంది. మొత్తం మీద వంద శాతం పోలింగ్, వంద శాతం ఓటర్ల నమోదు.. ఒకే దెబ్బకు రెండు పిట్టలు. ఇదీ సార్ నా మాట. వంద శాతం పోలింగ్‌కు నా సలహా. ఇట్లు బుడ్డోడు. ఆ తరువాత ఆ కలెక్టరు ఏమయ్యారో తెలియడం లేదు.

రాయబేరాలు...

ప్యాకేజి వీరులు... ఓట్లు లేని ధీరులు



రైల్వేకోడూరు, మే 1: ఎన్నికల సమయంలో తమకు వేలాది ఓట్లు ఉన్నాయని, తాము చెప్పితే మండలం అంతా ఏ పార్టీకి చెబితే ఆ పార్టీకి ఓట్లు వేస్తారని చెప్పడం నాయకత్వం వహించే వారి చేత కోట్లల్లో ప్యాకేజిలు తీసుకోవడం పరిపాటిగా మారింది. నియోజకవర్గంలో ఒకప్పుడు ఓట్లు ఉన్న నేతలు జీరోలుగా మారారు. ఎందుకంటే ప్యాకేజిలు తీసుకో వడం, దీనికి తోడు పార్టీలు మారడంతోనే ఓట్లు పోగొట్టుకున్న వారు ఎందరో ఉన్నా రు. ఒక పార్టీ పై స్టాండర్డ్ లేక పోవడంతో ఉన్న ఓటు శాతం తగ్గిపోయింది. దీన్ని పార్టీల నాయకత్వాలు గమనించి ఓట్ల శాతం ఉందన్న నమ్మకంతో కోట్లలో ప్యాకేజిలు ఇస్తున్నారు. ప్యాకేజిలు ఇవ్వకుండా ప్రచారాలకు రాకపోవడం, అజ్ఞాతంలోకి వెళ్లడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా నాయకత్వాలు వీటిని గమనించి ఓట్లు ఉన్నవారికి ప్రాధాన్యత కల్పిస్తే వారు అనుకున్న లక్ష్యాలను చేరతారని రాజకీయ వేధావులు చెబుతున్నారు. లేకపోతే ఉన్న డబ్బు ప్యాకేజిలకే పోతుందనేది నగ్నసత్యంగా రాజకీ య విశ్లేషకులు చెబుతున్నారు. ఇదంతా ఎస్సీ నియోజకవర్గంలో జరగడం విశేషం. ఇదే కాకుండా ఓట్లు లేని నేతలకు ప్యాకేజిలు ఇవ్వడంతో పక్క పార్టీల వారు వరుస విజయాలు సాధిస్తున్నారనేది కొసమెరుపు..

ఇదో తుత్తి...

లక్ష్మీనారాయణ 'రికార్డు' సత్కారం

రాజంపేట, మే1: ఎవరి పిచ్చి వారికి ఆనందం అన్నట్లు రాజంపేట పట్టణంలోని టీడీపీ సీనియర్ నేత, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు తరిగోపుల లక్ష్మీనారాయణకు చంద్రబాబు పిచ్చి ఎక్కువ. తన ఆరాధ్య దైవమైన చంద్రబాబును ఇప్పటికి ఆయన అనేక సందర్భాల్లో కలిసి 92సార్లు సత్కరించారు. ఏదో ఒక కార్యక్రమంలో పాల్గొనడం, సీనియర్ నేతగా సభల్లో ముందుకెళ్లిపోవడం, వెనువెంటనే అధినేతను కలిసి శాలువా, పూలబొకేతో సత్కరించవడం, ఆయనతో కలిసి ఫొటో తీసుకోవడం ఈయనకు మహదానందం. ఈయనకు మైకు పిచ్చి కూడా ఎక్కువ. ఏ టీడీపీ సభలోనైనా లక్ష్మీనారాయణ మైకు ఎత్తుకున్నాడంటే అక్కడున్న వారి పని అయిపోయినట్లే.. అమ్మో.. లక్ష్మీ నారాయణ అని చెవులు మూసుకుంటారు. ఆ విషయం అటుంచితే.. ఈయన లక్ష్యం చంద్రబాబును 108 సార్లు సత్కరించి ఆయన కరుణా కటాక్షాలను పొందాలని మొక్కుబడిగా పెట్టుకున్నాడు. అందులో భాగంగా ఇప్పటికి 92 సార్లు సత్కరించి సరికొత్త రికార్డును సొంతం చేసుకోవాలని ఉవ్విళ్లూరుతున్నారు.


ఇటీవల చంద్రబాబును కలిసి సత్కరిస్తున్న టి.లక్ష్మీనారాయణ

అభిమానం....

ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న పూలవర్షం

రాజంపేట, మే1: ఇప్పుడు ఎన్నికలు చాలా కాస్ట్లీ అయిపోయాయి. దగ్గరదగ్గరగా ఒక్కో నేత సుమారు రూ.70 కోట్లు ఖర్చుపెడితే తప్ప ముందుకు సాగే ప్రసక్తి లేదు. ఇక ప్రచారాలకు కోట్లు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఒక్క నియోజకవర్గమంటే ఐదు నుంచి ఆరు మండలాలుంటాయి. ఒక్కో మండలంలో 20 గ్రామ పంచాయతీల చొప్పున వంద పంచాయతీలుంటాయి. ఆ లెక్కన వెయ్యికి పైబడి మజరా గ్రామాలుంటాయి. ఈ గ్రామలన్నింటిలోనూ ప్రచారం చేయాల్సిందే. ఒక పల్లెలో ప్రచారం చేయాలంటే 15 రోజులకు రెండు లక్షలు ఖర్చు అవుతోంది. గానాభజానా, డప్పులు, పూలవర్షాలు, బాణసంచాలు, కేరింతలు, రకరకాల ఆర్భాటాలు, ప్రధానంగా బిర్యానీలు ఇలా చెప్పుకుంటూ పోతే తడిసిమోపెడవుతోంది. ఈ కోవలో రైల్వేకోడూరు నియోజక వర్గంలోని జనసేన, టీడీపీ నేతలు కలిసి చేస్తున్న ప్రచారాలు పెద్దఆర్భాటంగా సాగుతున్నాయి. జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ తరపున టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి కుటుంబమంతా ప్రచారంలో మునిగి తేలుతోంది. ఈ ప్రచారం సందర్భంగా చేస్తున్న ఆర్భాటాలను చూసి ఔరా.. ఈ ఎన్నికలు అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.


కోడూరు జనసేన ప్రచారంలో కురుస్తున్న పూలవర్షం

ఓటరన్న కటాక్షం కోసం ఎన్నెన్ని పాట్లో..

రాజంపేట, మే1: ఓటరన్న కృప కటాక్షం కోసం ఎన్ని పాట్లైనా పడతారు. ఎన్నికల తరువాత తాము ప్రజాప్రతినిధులుగా గెలిస్తే వారి ఫోజుకు అంతే ఉండదు.. ఆయనే అవతారపురుషుడైనట్లు.. ఫీలవుతూ ఓటర్లను చిన్నచూపు చూడటం పరిపాటి. ప్రస్తుత ఎన్నికల సమయంలో ఓటర్ల దయాదాక్షిణ్యాల కోసం పడుతున్న బాధలు అన్నీఇన్నీ కావు. కొందరు కాళ్లావేళ్లా పడితే మరికొందరు వంగివంగి దండాలు పెడితే.. మరికొందరు కింద కూర్చుని బతిమలాడితే... ఇలా అనేక రకాలుగా ఓటర్లను అభ్యర్థిస్తూ వారి గడ్డాలు పట్టుకుంటూ తమ పవిత్రమైన ఓటును మాకు వేసి గెలిపించాలని కోరుతూ విజ్ఞప్తి చేస్తుంటారు. ఈ కోవలో రాజంపేట జనసేన నియోజకవర్గ నేత అతికారి దినేష్ పాట్లు చూడండి.. ఆయన ఇటీవల జనసేన టికెట్టు కోసం చాలా వరకు ప్రయత్నించారు. తమ సమీప బంధువు సుగవాసి బాలసుబ్రమణ్యంకు టికెట్టు ఖరారవడంతో ఆయన గెలుపు కోసం పడుతున్న బాధలు అన్నీ ఇన్నీ కావు. కొందరి వద్ద కింద కూర్చుని బతిమలాడటం, మోకాళ్లపై కూర్చుని వంగివంగి దండాలు పెట్టడం చూసి నవ్వుకోవాల్సిన పరిస్థితి. ఔరా... ఓటరన్నకు ఎన్నికల సమయంలో ఎంత విలువుందో ఇట్టే తెలుస్తోంది. ఎన్నికల తరువాత అంతా తూచ్.. అనిపిస్తుంది.


మోకాళ్లపై కూర్చుని ఓ అవ్వకు నమస్కరిస్తూ ఓటు అడుగుతున్న అతికారి దినేష్



ఇది పుల్లూరు సచివాలయం. పైభాగంలో సీఎం జగన్ చిత్రం ఉన్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల కోడ్ వచ్చి రెండు నెలలవుతున్నా పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు కలుగజేసుకుని కోడ్ ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

- ఖాజీపేట

అక్రమ ఇసుక రవాణా అరికట్టే వారు లేరా ?

● అధికార పార్టీ నేతలకు అధికారుల అండ


రాత్రిళ్లు తరలిపోతున్న ఇసుక

జమ్మలమడుగు, మే 1: జమ్మలమడుగులో ఇసుక అక్రమ రవాణాను అదుపు చేసే వారు ఎవరూ లేరా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గూడెం చెరువు, అంబవరం, పొన్నతోట, గొరిగెనూరు తదితర ప్రాంతాల నుంచి రాత్రి సమయాల్లో ఇసుక రవాణా జోరుగా సాగుతోంది. ప్రొద్దుటూరు రోడ్డులోని పి.సుగుమంచిపల్లె, పెన్నానది నుంచి కాకిరేనిపల్లె మీదుగా తరలిపోతోంది. మైలవరం మండలం దొమ్మరనంద్యాలలో పెన్నానది నుంచి బైపాస్ రోడ్డు గుండా సరిహద్దులు దాటుతోంది. జమ్మలమడుగు, మైలవరం ప్రాంతాల్లో ఎస్ఈబీ అధికారులు, పోలీసులు అక్రమ ఇసుక రవాణాకు అదుపు చేయడంలో విఫలమయ్యారని ప్రజలు వాపోతున్నారు. కొందరికి మాత్రం అక్రమ ఇసుక రవాణాలో లాభం ఉన్నట్లుగా అందుకే ఏ ఒక్కరూ పట్టించుకోవడంలేదని ప్రజలు బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు. రాత్రిళ్లు పాత బస్టాండు గాంధీ విగ్రహం మీదుగా కూరగాయల మార్కెట్, కాపువీధుల్లో అక్రమ ఇసుక ట్రాక్టర్ల వేగానికి స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

బొజ్జ రోశన్న గెలుపు కోసం విస్తృత ప్రచారం




బద్వేలు..చెన్నంపల్లెలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న బొజ్జ రోశన్న, రితీష్‌కుమార్‌రెడ్డి, కాశినాయన.. కోడిగుడ్లపాడు సర్పంచ్‌కి పార్టీకండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించిన విజయమ్మ,రితీష్‌రెడ్డి

బద్వేలుటౌన్, మే 1 : అభివృద్ధిలో ముందుంటాం, ఆపదలో తోడుంటాం. ఆత్మీయులులా మీ వెంటఉంటామని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోశన్న, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె గ్రామంలో ఇంటింటికి వెళ్లి కమలంగుర్తుపై ఓటువేసి బొజ్జ రోశన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలంటూ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, జీవీ సుబ్బారెడ్డి, రమణయ్య, చరణ్, మాచుపల్లెక్రిష్టారెడ్డి, కొలవలి వేణుగోపాల్, రామమూర్తినాయుడు, సింగరయ్య, వెంకటసుబ్బయ్య నరసింహ,బసవి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అహర్నిశలుశ్రమిస్తా...: రాబోవుఎన్నికల్లో తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధికి కృషి చేస్తానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోశన్న అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని మైదుకూరురోడ్డు జాతీయరహదారి మెయిన్‌రోడ్డు, ప్రగతినగర్ తదితర కాలనీల్లో కమలంగుర్తుపై ఓటువేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చర ణ్, జీవి సుబ్బారెడ్డి, మాచుపల్లెక్రిష్నారెడ్డి, దానం, రమేష్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి బొజ్జ రోశన్నను గెలిపించాలి..: సార్వత్రిక ఎన్నికల్లో కమలంగుర్తుపై ఓటువేసి గెలిపించాలని బుధవారం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోశన్న సతీమణి అరుణమ్మ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని సిద్దవటంరోడ్డులో గడప గడపకు వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీదేవి, శ్రీనివాసులు, సింగంశెట్టి వెంకటసుబ్బయ్య, విజయ్‌కుమార్, మస్తాన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

స్పీడు పెంచిన కూటమి నాయకులు..: బ ద్వేలు అసెంబ్లీ స్థానానికి కూటమి అభ్యర్థులుగా పోటీ చేస్తున్న బొజ్జ రోశన్న గెలుపు కోసం టీడీపీ పార్లమెంటు మైనార్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి హబీబున్నీసా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బుధవారం ఆమె పోరుమామిళ్లలోని 53వ పోలింగ్ బూత్ పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించి బొజ్జ రోశన్నను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు. అలాగే కొరపాటిపల్లెలో ఎంపీటీసీ కల్వకూరి రమణ, బీజేపీ నాయకులు, జనసేన నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించి బొజ్జ రోశన్నను గెలిపించాలన్నారు.

కాశినాయన..: కోడిగుడ్లపాడు సర్పంచ్ వైసీపీ నాయకుడు సోమేసుల బాలగురయ్య బుధవారం వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. బుధవారం తన అనుచరులతో కలిసి టీడీపీ కార్యాలయంలో బద్వేల్ మాజీ ఎమ్మెల్యే కే. విజయమ్మ, కే.రితీశ్‌రెడ్డి, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి సమక్షంలో పార్టీకండువా కప్పుకున్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్కిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, హోండా రవీంద్రారెడ్డి,నర్సాపురం సర్పంచ్ ఖాజావలి, కరుణాకర్,ఓ.రోహిత్‌రెడ్డి,హుస్సేన్‌పీరా పాల్గొన్నారు.

బద్వేలు..: అరాచక పాలనను తరిమికొట్టాలని ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జా రోశన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలంటూ బుధవారం



కాశినాయన..సర్నాపురంలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న బొజ్జ అరుణ



బద్వేలు.. ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న బొజ్జ రోశన్న

జనసేన, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సతీమణి అరుణమ్మ 16వ వార్డులో లకిడి విజయ్ సతీమణి ఇందిర ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ కమలం గుర్తుకు ఓట్లువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు బొడ్డు శ్రీను, విజయ్‌కుమార్, మస్తాన్‌బాబు, దద్దం వెంకటేశ్వర్లు,సింగంశెట్టి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

కాశినాయన..: బద్వేల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న బొజ్జా రోశన్న కమలం గుర్తుకు ఓటేసి గెలిపించాలని బొజ్జా రోశన్న భార్య బొజ్జ అరుణ, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నర్సాపురంలో ముమ్మరంగా ఇంటింటి నిర్వహించారు.ఈకార్యక్రమంలో నాయకులు గురయ్య,పుల్లయ్య, ప్రభాకర్,కమలనాధుడు, కుమారి కరుణాకర్, సర్పంచ్ ఖాజావలి,నాగరాజు, హుస్సేన్‌పీరా, హిమామ్‌హుస్సేన్, హోండారవీంద్రారెడ్డి,మనోహర్‌రెడ్డి,శ్రీనివాసులరెడ్డి,రోహిత్‌రెడ్డి పాల్గొన్నారు.

బి.కోడూరు..: మండల పరిధిలోని అమ్మవారిపేట, అయ్యవారిపల్లె గ్రామాలకు చెందిన దాదాపు 300 మంది ఉపాధి కూలీలతో బుధవారం ఉదయం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రామసుబ్బారెడ్డి ప్రచారం నిర్వహిస్తూ కేంద్ర ప్రభుత్వం అందించే పథకాల గురించి వారికి వివరించారు. కూటమి అభ్యర్థిగా బొజ్జ రోశన్నను కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకులు దుగ్గిరెడ్డి, సర్పంచ్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో భారీగా టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

ఖాజీపేట, మే 1: ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని సుంకేసుల గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ దుగ్గిరెడ్డి శ్రీనివాసులరెడ్డి (వాసు) భార్య సరళ పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో పార్టీలో చేరారు. అదే విధంగా నాగపట్నానికి చెందిన తలుపుల చంద్రశేఖర్, ముప్పల శ్రీనివాసరావు, చంద్రమోహన్, మురళీకృష్ణ, ఓబుళనాయుడు, సుమన్, అనుచర వర్గం, మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ సమక్షంలో దాదాపు 70 కుటుంబాలు చేరారు. అలాగే పత్తూరుకు చెందిన నిగినేని బాలనాయుడు, నిగినేని అంకయ్య, మచ్చయ్య, పిట్టల నాగయ్య, అనుచర వర్గం పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో 10 కుటుంబాలు టీడీపీ పార్టీలో చేరారు. అలాగే మేజర్ పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీకి చెందిన మదన్‌మోహన్‌రెడ్డి, సునీల్‌కుమార్, ప్రశాంత్, వాసు, దస్తగిరి, అనుచరవర్గం పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో దాదాపు 20 కుటుంబాలు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, ఇన్‌చార్జి వెంకటస్వామి, మురళీమోహన్‌రెడ్డి, గోవిందురెడ్డి, చంద్ర ఓబుళరెడ్డి, గంగవరం ఆదినారాయణరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, రామచంద్రనాయుడు, పిచ్చినాయుడు, నంద్యాల సుబ్బయ్య, జానకిరాం, రమేష్‌నాయుడు, రామసుబ్బయ్య, రామానాయుడు, ఇండ్ల సుబ్బారెడ్డి, క్రిష్ణచైతన్యరెడ్డి, బుచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబును గెలిపించాలి..: రాష్ట్రాభివృద్ధి చెందాలంటే చంద్రబాబునాయుడు మళ్లీ ముఖ్యమంత్రి కావాలని టీడీపీ మాజీ ముస్లిం మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి సిద్దాం కదిరుల్లా అన్నారు. బుధవారం మేజర్ పంచాయతీలోని మెయిన్‌బజార్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బనగానిపల్లె అజ్మతుల్లా, కేకే బ్రదర్స్, సునీల్, జాఫర్, హర్షద్, ఆసీఫ్, షరీఫ్, నాసిక్, సుంకు సత్యం, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు..: టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ బుధవారం పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. స్థానిక నాయకులతో కలసి ఆయన మండలంలోని విశ్వనాథపురం, గంగవరం ఎస్సీ కాలనీల్లో ఇంటింటికి తిరుగుతూ టీడీపీ సైకిల్ గుర్తుకు ఓట్లేయ్యాలని కోరారు.

బ్రహ్మంగారిమఠం..: మైదుకూరు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్‌కు ఒకసారి అవకాశమిచ్చి గెలిపించాలని బి.మఠం మండల ప్రచార సమన్వయ కర్త పుట్టా ఆనంద్ యాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని చిన్నాయపల్లె, శాంతినగర్, రవీంద్ర నగర్, ముడుమాలఎస్సీకాలనీ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

30 కుటుంబాలు టీడీపీలో చేరిక..: బ్రహ్మంగారిమఠం మండలంలోని చిన్నాయపల్లె గ్రామానికి చెందిన చెన్నారెడ్డి (కాంట్రాక్టరు) ఈశ్వర్‌రెడ్డి, వారి అనుచరులు 30 మంది ప్రొద్దుటూరులోని పుట్టా నివాసంలో ఆయన సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, ముడుమాల పోలిరెడ్డి, మన్నెం నాగేశ్వర్‌రెడ్డి, నరసింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ రమేశ్, వేమిరెడ్డి మునిరెడ్డి, దారం బాలయ్య, వేమిరెడ్డి బాలచెన్నమ్మ, రమణయ్య, చిలమాల నాగయ్య, మీసాల దుగ్గిరెడ్డి, వెంగల్‌రెడ్డి సురేంద్రయాదవ్, చెన్నారెడ్డి, హుసేన్‌రెడ్డి, పోలిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, మన్యంవంకర్‌రెడ్డి, నగేశ్వర్‌రెడ్డి ఎల్.రమణారెడ్డి, రాజారెడ్డి, హుసేన్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

చాపాడు..: మైదుకూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్‌ను గెలిపించాలని ఆపార్టీ జిల్లా అధికార ప్రతినిధి పిచ్చపాటి మునిశేఖర్‌రెడ్డి, మైదుకూరు నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి మాచనూరు సుబ్బరాయుడు గ్రామస్థులను కోరారు. బుధవారం వారు అయ్యవారుపల్లె, లక్ష్మీపేట, వీరభద్రాపురం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. టీడీపీ నాయకులు గురివిరెడ్డి, వెంకటసుబ్బయ్య, వీరశేఖర్‌రెడ్డి, నారపురెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, సుబ్బరామిరెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దువ్వూరు (మైదుకూరు)..: సైకిల్ గుర్తుకు ఓట్లేసి పుట్టా సుధాకర్ యాదవ్‌ను గెలిపించాలంటూ దువ్వూరు మండలంలోని చల్లబసాయపల్లెలో ఆయన తమ్ముడు పుట్టా ప్రభాకర్ బుధవారంప్రచారం నిర్వహించారు. నాయకులుబోరెడ్డిరమణారెడ్డి, లక్ష్మీరెడ్డి, రాంబాబు, జయరాం పాల్గొన్నారు.



బి.మఠం.. టీడీపీలో చేరిన చిన్నాయపల్లె ప్రజలు



దువ్వూరు... ప్రచారం చేస్తున్న పుట్టా ప్రభాకర్






ఖాజీపేట... పుట్టా సమక్షంలో టీడీపీలో చేరిన దుగ్గిరెడ్డి సరళ, టీడీపీలో చేరిన నాగపట్నం గ్రామస్థులతో పుట్టా సుధాకర్‌యాదవ్

40 మద్యం బాటిళ్లు స్వాధీనం

కొండాపురం, మే 1 : అనుమతి కంటే మించి అక్రమంగా తీసుకెళుతున్న 40 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.స్థానిక మద్యం షాపు నుంచి కొర్రపాడు గ్రామానికి చెందిన ఆవుల మురళీకృష్ణ అనే వ్యక్తి అక్రమంగా అమ్మడానికి మద్యం బాటిళ్లను తీసుకెళుతుండగా వాటిని స్వాధీనపరుచుకున్నట్లు కొండాపురం ఎస్ఐ యోగీంద్ర తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రొద్దుటూరులో 152...

ప్రొద్దుటూరు క్రైం, మే 1 : రాజుపాలెం మండలం పర్లపాడు గ్రామానికి ఇరువురిని ప్రొద్దుటూరు పోలీసులు పట్టుకున్నారు. పర్లపాడుకు చెందిన అచ్యుతుడు, శ్రీనివాస్ అనే వ్యక్తులు పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. వారిని అరెస్టు చేసి152 ఆంధ్ర మద్యం సీసాలు, ,మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే ఈ మద్యం సరఫరా చేసిన మద్యం దుకాణాల యాజమానులపై కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు. ఈ దాడులలో ఎస్ఐ కిశోర్ సిబ్బంది పాల్గొన్నారు.

రతనాల వేంకటేశ్వరస్వామికి శ్రవణా నక్షత్ర పూజలు



ప్రొద్దుటూరు టౌన్, మే 1: స్థానిక పాత మార్కెట్‌లోని లలితాదేవి రతనాల వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రంను పురష్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం మహిళలతో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

కలసపాడు, మే 1 : ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి, ఎంఈవోలు ప్రేమ్‌సాగర్, మస్తాన్‌వలి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల లో చదువుతూ పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎస్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో కలసపాడు మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కవిత, ఎస్టీయూ నేతలు సుబ్రమణ్యం, చంద్రహాసరెడ్డి,శేఖర్‌బాబు,ఎస్వీ సత్యనారాయణ, వెంకటరెడ్డి, ప్రసాద్, సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామాయణంపై ఉచిత బోధనా తరగతులు

మైదుకూరు, మే 1 : స్థానిక శివునిమాన్యం వీధిలో ఉన్న వినాయక స్వామి ఆలయంలో విద్యార్థులకు రామాయణంపై ఉచిత బోధనా తరగతులు నిర్వహిస్తున్నారు. 3నుంచి 7వ తరగతి విద్యార్థులకు రామాయణంతో పాటు హనుమాన్ చాలీసా, నిత్య పారాయణం, శ్లోకాలపై ఈనెల 4 నుంచి నెల రోజుల పాటు ఉదయం బోధనా తరగతులు నిర్వహిస్తామని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆర్ఎస్ఎస్ నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



దొమ్మరనంద్యాలలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మైలవరం, మే 1 : ప్రజలంతా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని జిల్లా అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, జమ్మలమడుగు డీఎస్పీ యశ్వంత్ పేర్కొన్నారు. రానున్న సార్వత్రిక పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని బుధవారం మండల పరిధిలోని దొమ్మరనంద్యాల గ్రామాన్ని పరిశీలించి ప్రజలకు ఓటు హక్కుపై భరోసా కల్పించారు. ఓటు హక్కు ను ప్రశాంత వాతావరణంలో వాడుకోవచ్చన్నారు.మే 13న జరిగే ఎన్నికల్లో ఎటువంటి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా పోలీస్‌శాఖ అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ఎన్నికల వేళ ఘర్షణలు, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.ఓటర్లు ఎటువంటి భయానికి లోనుకాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ శ్రీకాంత్, మైలవరం ఎస్ఐ రెడ్డి సురేష్, పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

వరద, భూపేశ్‌ను గెలిపించుకుందాం

ప్రొద్దుటూరు,మే 1 : పదేళ్లుగా రాచమల్లు నిజాయితీ ఏమిటో ప్రొద్దుటూరు ప్రజలు బాగా తెలుసుకున్నారని అతని బురిడీ మాటలు ఇక నమ్మే పరిస్థితి లేదని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. బుధవారం టూటౌన్ బైపాస్ రోడ్డులోని ఏ1 ట్రావెల్స్ యజమాని నాయబ్‌రసూల్ నరసింహ హుస్సేన్‌తో పాటు 20 కుటుంబాలు కొత్తపల్లె సర్పంచ్ శివచంద్రారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి. వీరికి మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పార్టీకండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ ఎమ్మెల్యే అభ్యర్థులైన వరదరాజులరెడ్డి భూపేశ్‌రెడ్డిలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, కౌన్సిలరు వంగనూరు మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

వరదరాజులరెడ్డి, భూపేష్‌లను గెలిపించుకుందాం..: ప్రొద్దుటూరు ఎమ్మెల్యేగా నంద్యాల వరదరాజులరెడ్డిని కడప ఎంపీగా చదిపిరాళ్ళ భూపేశ్‌రెడ్డిని గెలిపించుకుందామని మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య పేర్కొన్నారు. బుధవారం కొత్తపల్లె పంచాయతీ టీచర్స్‌కాలనీ లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో గాండ్ల సంఘం అధ్యక్షుడు జినాగయ్య, జీసీ పుల్లయ్య, గోపవరం శ్రీను, తులశయ్య, పాలూరు ప్రసాద్, దుగ్గిరాజశేకర్ గోపాలం,నల్లంశంకర్ పాల్గొన్నారు.

వైసీపీ అవినీతి రాజకీయాలే టీడీపీ విజయానికి సోపానాలు..: వైసీపీ అవినీతి రాజకీయాలే టీడీపీ విజయానికి సోపానాలని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సోదరులు నంద్యాల హనుమంతరెడ్డి, భార్గవరెడ్డి, ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం4 వవార్డు వైఎంఆర్ కాలనీలో కూటమి అభ్యర్థులైన నంద్యాల వరదరాజులరెడ్డి,భూపేశ్‌రెడ్డిలను ఎమ్మెల్యే, ఎంపీలుగాసైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ కామిశెట్టిబాబు, 4 వార్డు మాజీ కౌన్సిలర్ కాకుమాని ఆనంద్,కాకుమాని హరీష్ తాటి శ్రీనివాసుల యాదవ్, వంకదార శ్రీధర్, కాకుమాని బాబు, శ్రీనివాసులరెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ ప్రభుత్వంలోనే యువకులకు భవిష్యత్తు..: టీడీపీ ప్రభుత్వంలోనే యువకులకు భవిష్యత్తు వుంటుందని మున్సిపల్ మాజీ ఇన్‌చార్జ్ చైర్మెన్ వీఎస్ ముక్తియార్ పేర్కొన్నారు.బుధవారం 17 వవార్డు నడింపల్లెలో ముస్లిం యువకులు ముక్తియార్ ఆధ్వర్యలో టీడీపీలోచేరారు. కార్యక్రమంలో మెట్టుపల్లి రామచంద్రారెడ్డి, జాఫర్, ఆచార్ల నూర్, గుత్తి బానూ, మహబూబ్‌బాషా, జావీద్, బాలనాగమ్మ పాల్గొన్నారు.

వైసీపీ అరాచకపాలనను అంతం చేద్దాం..: వైసీపీ అరాచక పాలనను అంతంచేద్దామని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం 29 వవార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థులైన నంద్యాల వరదరాజులరెడ్డి, చదిపి రాళ్ళ భూపేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరా రు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి,వీఎస్ ముక్తియార్, సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, ఈవీ సుధాకర్‌రెడ్డి, వద్ది బాలుడు , సీతారామిరెడ్డి, మార్తల లక్ష్మీరెడ్డి, నల్లబోతుల నాగరాజు, జింకా రామక్రిష్ణ, వుశాల సురేష్, ఉమ్మడి శెట్టి, బోగాల లక్ష్మీనారాయణమ్మ పాల్గొన్నారు.

మహిళల సంక్షేమం టీడీపీతోనే సాధ్యం..: మహిళల సంక్షేమం టీడీపీతోనే సాధ్యం అని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి కుమార్తెలు అనురాధ, అరుణమ్మ, కోడలు మీనా ,మనుమరాళ్ళు కోమల్, శిల్ప, చమేలి, వసంత భూపేశ్ సతీమణి జ్యోతి పేర్కొన్నారు. బుధవారం 1వవార్డు బుడ్డాయపల్లెలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో యనమల సుబ్బిరెడ్డి, మాజీ కౌన్సిలర్ వెంకటరమణ సుబ్బరెడ్డి పాణ్యం నాగమునిరెడ్డి, ధనిరెడ్డి శ్రీధర్‌రెడ్డి,చీమలరాజశేఖర్‌రెడ్డి,రసూల్ గౌస్ పాల్గొన్నారు.

వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయి..: వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వైఎస్ జబీవుల్లా పేర్కొన్నారు. బుధవారం సోములవారిపల్లె పంచాయతీలోని పెన్నానగర్‌లో టీడీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులైన భూపేశ్‌రెడ్డి వరదరాజులరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నంద్యాల గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వరదరాజులరెడ్డి సమక్షంలో వైసీపీనుంచి టీడీపీలో చేరిన వారు



29 వవార్డు ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



1 వవార్డు ప్రచారంలో పాల్గొన్న వరదరాజులరెడ్డి కుమార్తెలు




నడింపల్లెలో ముక్తియార్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన యువకులు, 4 వార్డు ప్రచారంలో పాల్గొన్న వరదరాజులరెడ్డి సోదరులు

జమ్మలమడుగులో ఘనంగా మేడే

జమ్మలమడుగు, మే 1: జమ్మలమడుగు పట్టణంలో బుధవారం మేడే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా వారు మున్సిపల్ క్లస్టర్‌పాయింట్ వద్ద నుంచి పాత బస్టాండు మీదుగా తదితర వీధుల్లో ఆటోలతో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ కార్మికులకు అండగా నిలిచేది సీఐటీయూ అన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు దాసరి విజయ్, వినయ్‌కుమార్, గోపాల్‌దాసు, యేసుదాసు, రాజు, దస్తగిరి, దివాకర్, మన్సూర్, మేఐహెల్ప్‌యూ ఫౌండేషన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అలాగే జమ్మలమడుగు పాత బస్టాండు ఎద్దుల ఈశ్వర‌రెడ్డి విగ్రహం వద్ద మేడేను పురస్కరించుకుని ఏఐటీయూసీ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ప్రసాద్, సీనియర్ నాయకులు దండు రవి, సుబ్బన్న, రాంప్రసాద్, పెద్దులయ్య, చిన్న వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు సీఎం అయితే ఉజ్వల భవిష్యత్తు



ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని తాళ్లమాపురంలో టీడీపీ మేనిఫెస్టోను ఓటర్లకు అందిస్తున్న భూపేష్‌రెడ్డి



కమలాపురం మండలంలోని నల్లింగాయపల్లెలో ప్రచారం చేస్తున్న భూపేష్‌రెడ్డి, పక్కన కమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

(కడప - ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం కోసం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన నేత పవన్‌కళ్యాణ్ బీజేపీతో కలిసి అద్భుతమైన మేనిఫెస్టో రూపొందించారని, చంద్రబాబు సీఎం అయితే పేదలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని తాళ్లమాపురం, కమలాపురం నియోజకవర్గంలోని నల్లంగాయపల్లెలో ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు అభ్యర్థి వరదరాజులరెడ్డి, కమలాపురం అభ్యర్థి పుత్తా చైతన్యరెడ్డిని గెలిపించాలని కోరారు. సంక్షేమ పథకాలన్నీ డోర్‌డెలివరీ అవుతాయని, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. కడప పార్లమెంటుకు సైకిలు గుర్తుపై అసెంబ్లీ అభ్యర్థులకు, బీజేపీ పోటీ ఉన్న చోట అసెంబ్లీకి కమలంకు పార్లమెంటుకు సైకిలు గుర్తుకు ఓటు వేయాలని భూపేష్‌రెడ్డి ఓటర్లను విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు సీఎం అయితే ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతుంది. ఇంట్లో ఎంత మంది ఉన్నా సరే తల్లికి వందనం ద్వారా ఒక్కొక్కరికి 15వేలు 18 సంవత్సరాలు నిండిన మహిళలకు 1500, పేదలకు ఉచితంగా గ్యాస్‌సిలిండర్లు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, వంద శాతం వైకల్యం ఉన్న వారికి పింఛను రూ.15వేలు, ఇంకా పింఛన్‌ను రూ.3వేల నుంచి నాలుగువేలకు పెంచడం, రైతులకు ఏడాదికి రూ.20వేలు, ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు, పేదలకు అన్నాక్యాంటిన్లు, ఉచిత ఇసుక, నిరుద్యోగులకు రూ.3వేలు భృతి ఇస్తామన్నారు. ఈసారి నాకు అవకాశం ఇవ్వండి, కడప అభివృద్ధి కోసం పాటుపడతా. స్టీలు ఫ్యాక్టరీ కోసం నిర్మాణం పూర్తిచేస్తా. మీ అందరి బాగోగులు చూస్తానని విజ్ఞప్తి చేశారు.

వందల ఎకరాలు ఆక్రమణ

- అధికార పార్టీ అండదండలు
- పట్టించుకోని అధికారులు

జమ్మలమడుగు, మే 1: జమ్మలమడుగు నియోజకవర్గంలోని మైలవరం జలాశయం గేట్లకు దక్షిణంవైపు నర్సీజీ కొట్టాలు, పొన్నతోట గ్రామాల మధ్య జలాశయం ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయని పలువురు వాపోతున్నారు. జలాశయం ఇరిగేషన్ శాఖకు సంబంధించి 343 ఎకరాల భూమి ఉంది. అందులో కొందరు అధికార పార్టీ అండతో గత 5 సంవత్సరాల నుంచి భారీగా ఆక్రమణ చేసినట్లు సమీప గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మైలవరం ఇరిగేషన్ శాఖకు సంబంధించి ప్రభుత్వ భూములు, స్థలాలు పూర్తిగా ఆక్రమణ జరిగినా అధికారులు పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. అయితే అధికారులకు ఆ భూముల నుంచి ఆక్రమిత స్థలాల నుంచి లాభం ఉన్నట్లుగా కొందరు ఆరోపణలు చేస్తున్నారు. ఏదేమైనా దక్షిణ కాలువ పక్కన భూములను ఆక్రమణ చేశారని, అధికారులకు తెలిసినా స్పందించకపోవడం దారుణమన్నారు. వర్షాకాలంలో జలాశయానికి నీటి వరద ఎక్కువగా వస్తే ఆ ప్రాంతానికి సంబంధించిన ఆనకట్ట ప్రశ్నార్థకరంగా ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. అయితే ఎవరెవరు ఎన్ని ఎకరాలు ఆక్రమణ చేశారో వాటికి సంబంధించిన రిపోర్టు అధికారుల వద్ద ఉన్నట్లుగా తెలుస్తోంది. భూముల ఆక్రమణకు సంబంధించి చర్యలు తీసుకోవాలన్నా గత 5 సంవత్సరాల నుంచి అధికార పార్టీ అండతో అధికారులు ముందుకు వెళ్లడం లేదని విమర్శలున్నాయి. ఈ విషయంపై మైలవరం ఇరిగేషన్ శాఖ ఏఈ గౌతమ్‌కుమార్‌రెడ్డిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. మైలవరం జలాశయంలో 0.511 టీఎంసీ లోపే నీరు ఉందని, దక్షిణ కాలువ కింద 343 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని, ఆ భూమి ఆక్రమణలో ఉందని, అయితే ఎవరెవరు ఎన్ని ఎకరాలు ఆక్రమించారో రిపోర్టు తయారు చేసి ఉన్నామని ఆయన తెలిపారు.



ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములు



వైసీపీ సర్కారును సాగనంపండి

- రాజోలి ముంపువాసులకు మెరుగైన ప్యాకేజీ తెప్పిస్తాం
- ఎన్‌డీఏ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి

పెద్దముడియం, మే 1: అన్నిరంగాల్లో వైఫల్యమైన వైసీపీ సర్కారును ఇంటికి సాగనంపాలని ఎన్‌డీఏ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి ప్రజలను కోరారు. పెద్దముడియం మండలంలో బుధవారం రోడ్‌షో నిర్వహించారు. మండలంలోని కొండసుంకేసుల, కలవటాల, పాపాయపల్లె, బోడితిప్పనపాడు, పెద్దముడియం, పాలూరు. సుద్దపల్లె, జంగాలపల్లె, జె.కొట్టాలపల్లె, ఉప్పలూరు, బలపనగూడూరు, నెమళ్లదిన్నె, చిన్నముడియం, గరిశలూరు, ఎస్.కొట్టాలపల్లె, పెద్దపసుపుల గ్రామాల్లో రోడ్‌షో జరిగింది. ఈ సందర్భంగా ఆదినారాయణరెడ్డి, భూపేష్‌రెడ్డిలు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే ఏవైనా అభివృద్ధి కార్యక్రమాలు చేశారా అంటూ ప్రజలను ప్రశ్నించారు. నెమళ్లదిన్నె గ్రామంలో భూపేశ్, ఆదినారాయణరెడ్డి పత్రికా సమావేశం నిర్వహించి రాజోలి రైతులను జగన్ సర్కారు నిలువునా ముంచిందని, భూములు తీసుకుని ఇంతవరకు పైసా పరిహారం కూడా ఇవ్వలేదని విమర్శించారు. రాజోలి రైతులకు ఎకరాకు 24 లక్షల మేర పరిహారం వచ్చేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల: మండలంలో వైసీపీ నుంచి బీజేపిలోకి బారీగా చేరికలు జరుగుతున్నాయి. బుధవారం ఉదయం ఎర్రగుంట్ల 6, 7, 8, 9 వార్డులకు చెందిన సుమారు 30 కుటుంబాలు మండల ఇన్‌చార్జి మేకల జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్డీయే కూటమి అభ్యర్థి ఆదినారాయణరెడ్డి సమక్షంలో చేరాయి. సుధీర్, రాజేష్, దస్తగిరి, క్రిష్ణకుమార్‌రెడ్డి, మురళీక్రిష్ణ తదితర 30 కుటుంబాలకు ఆదినారాయణరెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయేది ఎన్డీయే కూటమి ప్రభుత్వమేనని ఆది పేర్కొన్నారు.

ముద్దనూరు: మండల పరిధి కొసినేపల్లి గ్రామంలోని 30 కుటుంబాలు బుధవారం భూపేష్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి సమక్షంలో ఎన్డీయేలో చేరాయి. వారికి టీడీపీ, బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పెద్దముడియంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆదినారాయణరెడ్డి



ముద్దనూరులో.. పార్టీలో చేరిన కొసినేపల్లి గ్రామస్తులు

కొండాపురం: కూటమి మేనిఫెస్టోతో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకురుతుందని మండల బీజేపీ ఇన్‌చార్జి దేవగుడి శివనారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని సంకేపల్లె, సిరిగేపల్లె, మురగంపల్లె, కొత్తపల్లె గ్రామాలలో బుధవారం ఆయన ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు నాగేశ్వరరెడ్డి, సుధాకర్‌నాయుడు పాల్గొన్నారు.

జమ్మలమడుగు: మున్సిపాలిటీ పరిధిలో బుధవారం ఆదినారాయణరెడ్డి సతీమణి అరుణ ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈమెతో పాటు ఆదినారాయణరెడ్డి తమ్ముడు గోపాల్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అరాచక పాలనను అంతమొందిద్దాం

- అభివృద్ధి సంక్షేమ పాలనకు ఓటేద్దాం
- ఎన్‌డీఏ అభ్యర్థుల గెలుపే లక్ష్యం
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), మే 1: అరాచక పాలనను అంతమొందించి అభివృద్ధి సంక్షేమ ఫలాలకు ఓటు వేద్దామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి పిలుపునిచ్చారు. ఎన్‌డీఏ కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా చేయి చేయి కలిపి ముందుకు సాగుదామని చెప్పారు. బుధవారం కడప నగరం ద్వారకా నగర్‌లోని వాసు నివాసంలో వారు విలేకరులతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించి అధికారంలోకి రావడం తథ్యమని, చంద్రబాబు దూరదృష్టితో సంపద సృష్టించగలరని కూటమి అభ్యర్థులతోనే ప్రజాపాలన లభిస్తుందన్నారు. కూటమి తాజాగా విడుదల చేసిన ప్రజా మేనిఫెస్టోపై వివరించారు. అదే విధంగా గురువారం జరగబోవు ప్రజాగళం సమావేశం ఏడు రోడ్ల కూడలి వద్ద జరుగుతుందని టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు ప్రజలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు. సంక్షేమ పాలనకు ఓటు వేయాలని టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎన్‌డీఏ కూటమితోనే అద్భుతమైన మేనిఫెస్టో రూపొందించారని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. మేనిఫెస్టో ప్రకారం అయితే ప్రతి ఒక్క పేద ప్రజలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలతో పాటు సంక్షేమ కార్యక్రమాలు అమలవుతాయన్నారు. అర్హత కలిగిన ప్రతి మహిళకు మూడు ఉచిత సిలిండర్లు, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, కుటుంబంలో ఎంత మంది విద్యార్థులు చదువుతుంటే వారికి ఏడాదికి రూ.15వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. మహిళలకు 1500, రైతులకు 20 వేలు, నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు భృతి, ఈ విధంగా సంక్షేమ పథకాలు అన్నీ కూడా అమలు చేస్తామన్నారు. నగరంలో తాగునీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయరంగాన్ని అట్టడుగున దిగజార్చిన వ్యక్తి కేవలం వైఎస్ జగన్ అని చెప్పారు. హిందూపురం ఎంపీ నిమ్మల క్రిష్ణప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ చంద్రబాబు బహిరంగ సభలు జరుగుతున్నా ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. వైసీపీకి ఎందుకు ఓటు వేయాలో చెప్పాలని ప్రశ్నించారు. గతంలో కేసులు బయటపడేందుకా లేదా వివేకా కేసులో తన అనుచరులు, తన బంధువర్గం బయట పడేందుకా అని ప్రశ్నించారు. 25 ఎంపీ సీట్లు ఇస్తే కేంద్రం మెడలు వంచుతానని ఈ రోజు కేంద్రం వద్ద మోకాలిపై కూర్చున్న పరిస్థితి వచ్చిందన్నారు. అప్పుల ఊబిలో ఆంధ్రరాష్ట్రం కూరుకుపోయిందన్నారు. దీన్ని మళ్లీ సక్రమమైన మార్గంలో పెట్టాలంటే సమర్థుడైన నాయకుడు చంద్రబాబు మాత్రమేనన్నారు. కూటమి వస్తే చంద్రబాబు పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలోకి ముందుకు వెళ్తుందన్నారు. రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని, రాష్ట్ర సంపద ఎలా పెంచాలో తెలిసిన ఏకైక వ్యక్తి చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సుధా దుర్గాప్రసాద్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి, టీడీపీ నాయకులు కత్తి రవీంద్ర, వెంకటరమణయ్య, జనసేన నాయకులు తుంగా రమణయ్య, కాపు సంఘం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేసుదాసు, ప్రకాశ్, రామ్మూర్తి, బండి బాబు, చలపతి, జగదీష్, సుబ్రమణ్యం, రెడ్డిపల్లె మహేష్ బాబు, రమణతో పాటు జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి, చిత్రంలో మాధవిరెడ్డి, తదితరులు

ఫ్యానుకు ఓటేస్తే ఉరి వేసుకున్నట్లే

- జగన్‌కు పిచ్చి పరాకాష్టకు చేరుకుంది
- జగన్ అనే దరిద్రునికి ఓటు వేయకండి
- మాజీ మంత్రి డీఎల్

ఖాజీపేట, మే 1: వైసీపీ గుర్తు ఫ్యానుకు ఓటేస్తే మీరు ఉరి వేసుకున్నట్లేనని మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి అన్నారు. బుధవారం ఖాజీపేట జీప పంక్షన్ హాలులో ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళన మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి, మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎల్ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ తన 45 సంవత్సరాల రాజకీయ అనుభవంలో ఇలాంటి దరిద్రపు ముఖ్యమంత్రిని చూడలేదని, చూడబోనని అన్నారు. ఇలాంటి వ్యక్తికి మీరు ఓటు వేస్తే మన కష్టాలు మనం కొని తెచ్చుకున్నట్లే అన్నారు. మన భూమి పాస్ పుస్తకాలపై ఆయన ఫొటోలు వేసుకుని పిచ్చి ఆనందం పొందుతున్నాడని, పులివెందుల ప్రచారంలో వైఎస్ భారతిని రైతులు నిలదీస్తే సమాధానం లేదని అన్నారు. మన ముఖ్యమంత్రిని చాలా మంది ఏమి చదువుకున్నాడని అడిగితే ఇంతవరకు సర్టిఫికెట్లు చూపలేదన్నారు. చదువుకుని ఉంటే చట్టాలపై అవగాహన కలిగి ఉండేవాడన్నారు. జగన్‌కు పిచ్చి పరాకాష్టకు చేరుకుందని, ఇలాంటి వ్యక్తికి ఓటు వేయకండి అని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్‌కు కలిసికట్టుగా ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. మండల పరిధిలోని ఆర్యవైశ్యులందరు వచ్చారని, ఇద్దరు మాత్రమే స్వలాభం కోసం రాలేదని, వారు వెంట్రుకతో సమానమని అన్నారు. ఆర్యవైశ్యులకు అభివృద్ధి చేసి ఉంటే అది తానే చేసి ఉంటానని అన్నారు. వైసీపీ ప్రభుత్వం మరలా వస్తుందని ఈ చోటా నాయకులు అనుకుంటున్నారని వచ్చేది ఎన్డీయే ప్రభుత్వమే అన్నారు. అనంతరం పుట్టా సుధాకర్‌యాదవ్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అంటే తనకు ఎంతో అభిమానం అని, ఎవరైనా ప్రలోభాలు పెడితే తమదృష్టికి తేవాలని అన్నారు. మీకు ఎలాంటి కష్టమొచ్చినా ముందుంటా అన్నారు. తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని, అభివృద్ధి చేసి చూపుతానన్నారు. ఈ కార్యక్రమంలో మాకం రామక్రిష్ణయ్య, కొలటాల మోహన్, మురళీకృష్ణ, సుంకు సత్యం, గాదంశెట్టి సుబ్రహ్మణ్యం, కాటా నరసింహరావు, గంగిశెట్టి చక్రపాణి, ఆర్యవైశ్య సభ్యులు పాల్గొన్నారు.

ప్రలోభాలకు తెరలేపిన వైసీపీ





వైసీపీ, ఎన్డీఏ కూటమి నేతల మధ్య వాగ్వాదం, ముఖాలకు కొంగు కప్పుకుని పారిపోతున్న యానిమేటర్లు

- మెప్మా యానిమేటర్లతో రహస్య సమావేశం

బద్వేలు, మే 1: సార్వత్రిక ఎన్నికలలో వైసీపీ గెలిచేందుకు అడ్డదారులు తొక్కుతోంది. ఎన్నికల నిబంధనలు తమకు వర్తించవన్న రీతిలో వైసీపీ నేతలు వ్యవహరిస్తున్నారు. బుధవారం వైఎస్సార్ కడప జిల్లా బద్వేలులో వైసీపీకి చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్ కళాశాలలో మెప్మా యానిమేటర్లతో రహస్య సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 2వేలకు పైగా డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల్లోని మహిళా ఓట్లు వైసీపీకి పడేలా చేసేందుకు యానిమేటర్లతో సమావేశం నిర్వహించారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి సుధ, కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్ గురుమోహన్, బద్వేలు మున్సిపల్ వైస్‌చైర్మన్ సాయిక్రిష్ణ హాజరయ్యారు. డ్వాక్రా గ్రూపు సభ్యులందరితో వైసీపీకి ఓట్లు పడేలా చేయాలని యానిమేటర్లను. తిరిగి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మీకు అన్ని విధాలా లబ్ధి చేకూరుస్తామని, ప్రస్తుతానికి నగదు రూపంలో లేదా వస్తు రూపంలో అందజేస్తామని చెప్పారని విశ్వసనీయ సమాచారం. ప్రైవేటు కళాశాలలో యానిమేటర్లతో రహస్య సమావేశం నిర్వహిస్తున్నారని తెలుసుకున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగళరెడ్డి, మిత్తికాయల రమణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డితో పాటు పలువురు నేతలు, కార్యకర్తలు కళాశాల వద్దకు చేరుకున్నారు. కొద్దిసేపు వీరికి, వైసీపీ నేతలకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో యానిమేటర్లు ముఖాలకు ముసుగులు వేసుకుని అక్కడి నుంచి పారిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాల వారికి సర్ది చెప్పడంతో సమస్య సద్దుమణిగింది. ఈ సందర్భంగా కూటమి నేతలు మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నప్పటికీ వైసీపీ నేతలు కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తొలి మహిళావధాని ప్రభావతి మృతి తీరని లోటు

కడప(కల్చరల్), మే 1. ఆంధ్రదేశంలో తొలి మహిళావధానిగా పేరుగాంచిన మడకశిర కృష్ణ ప్రభావతి (78) విజయవాడలో మరణించడం సాహితీ జగత్తుకే తీరని లోటని మహా కవయిత్రి మొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, ప్రముఖ సాహితీవేత్తలు సుబ్బరాఘవరాజు, జింకా సుబ్రమణ్యం, పద్యకవి కె.గురుమూర్తి ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. రాష్ట్ర, రాష్ట్రేతరాలలో శతాధిక అవధానాలను పండిత పామర జనరంజకంగా నిర్వహించి పలువురి ప్రశంసలకు పాత్రులయ్యారన్నారు. గుంతకల్లుకు చెందిన ఆమె పదికి పైగా రచనలు చేసి రైల్వే జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పదవీ విరమణ చేశారన్నారు. ఆమె ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారన్నారు. 2020 సంవత్సరంలో కడప కళాక్షేత్రంలో జరిగిన మొల్ల సాహితీ జయంతి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరై మొల్ల సాహితీ సేవా పురస్కారాన్ని అందుకున్నారని గుర్తు చేశారు.



ప్రభావతి (ఫైల్)

నిందితుడికి 6 నెలల జైలు శిక్ష

మైలవరం, మే 1: ద్విచక్ర వాహనంలో వేగంగా వెళ్తూ ఓ వ్యక్తిని ఢీకొన్న ఘటనలో నార్జాంపల్లికి చెందిన అన్నేబోయిన ఉపేంద్ర అనే యువకుడికి 6 నెలల జైలు శిక్ష విధించినట్లు బుధవారం జమ్మలమడుగు కోర్టు జడ్జి తీర్పు వెల్లడించినట్లు మైలవరం ఎస్ఐ రెడ్డిసురేష్ తెలిపారు. 2018 సంవత్సరంలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి కోర్టు తీర్పు వెల్లడించింది. ద్విచక్ర వాహనంలో నార్జాంపల్లి చెందిన అన్నేబోయిన ఉపేంద్ర అనే యువకుడు వేగంగా వెళ్తూ దొమ్మరనంద్యాల గ్రామానికి చెందిన నీలూరు కుమ్మరి దశరథకుమార్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో దశరథకుమార్ మృతి చెందడంతో మైలవరం పోలీస్ స్టేషన్లో 2018లో కేసు నమోదైంది.

హౌసింగ్ బోర్డు కాలనీలో చోరీ

- 13 తులాల బంగారు అపహరణ

కడప (క్రైం), మే 1: కడప నగరం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఓ ఇంట్లో దొంగలు పడి 13 తులాల బంగారు నగలను అపహరించినట్లు వన్‌టౌన్ సీఐ రంగస్వామి తెలిపారు. సీఐ వివరాల మేరకు... హౌసింగ్ బోర్డులో నివాసం ఉంటున్న సరోజారెడ్డి గత నెల 27న తమ కుటుంబ సభ్యులతో లక్కిరెడ్డిపల్లెకు వెళ్లి తిరిగి బుధ వారం ఇంటికొచ్చారు. ఇంటి తాళాలు పగలగొట్టి ఉండ టంతో అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు 13 తులాల బంగారు చోరీ అయినట్లు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ మృతి కేసులో ముగ్గురు అరెస్టు

కడప (క్రైం), మే 1: కడప నగరం సాగర్ కాలనీలో గత నెల 22న ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో ఆ వివాహిత భర్త, అత్తమామలను బుధవారం పాత బైపాస్ వద్ద అరెస్టు చేసినట్లు రిమ్స్ సీఐ రామచంద్ర తెలిపారు. సీఐ వివరాల మేరకు.. కర్నూలుకు చెందిన లతిక మృతికి కారకులైన ఆమె భర్త సాయికుమార్, అత్తామామ పద్మ, లింగన్నలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), మే 1: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఆయా పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని కేటాయించే రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను సజావుగా పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయ రామరాజు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ హాలులో ఎన్నికల సాధారణ పరిశీలకులు కునాల్ సిల్కు, భానుదాస్ పాలవె పర్యవేక్షణలో జేసీ గణేష్ కుమార్, నగరపాలక కమిషనరు ప్రవీణ్‌చంద్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయపార్టీల ప్రతినిధుల సమక్షంలో ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్ణయించిన నిర్ణీత సమయంలో పకడ్బందీగా ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టామన్నారు. ముందుగా పార్లమెంటరీ నియోజకవర్గం, అనంతరం 7 అసెంబ్లీ నియోజకవర్గాల పోలింగ్‌స్టేషన్ల వారీగా ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల ర్యాండమైజేషన్ పూర్తి చేశామన్నారు. ఎన్నికల యంత్రాలను తరలించే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ ఉంటుందని, సెక్యూరిటీ, ప్రోటోకాల్ ప్రకారం పటిష్ట పోలీసు బందోబస్తుతో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పోలింగ్ కేంద్రాలకు యంత్రాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. సమావేశంలో అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు

వైవీయూ సెమిస్టర్ల పరీక్ష ఫలితాలు విడుదల

కడప(ఎర్రముక్కపల్లె), మే 1: వైవీయూ పోస్టుగ్రాడ్యుయేషన్ 1, 3 సెమిస్టరు పరీక్షల ఫలితాలను వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్, రిజిస్ట్రారు వైపీ వెంకటసుబ్బయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్.ఈశ్వర్‌రెడ్డి బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ చింతా సుధాకర్ మాట్లాడుతూ ఎంఏ మూడో సెమిస్టరు తెలుగు, ఇంగ్లీషు, హిస్టరీ పీఎస్ అండ్ పీఏ ఎకనామిక్స్ ఉర్దూ ఎంకామ్, అలాగే ఎంఎస్సీ బయోకెమిస్ట్రీ, బోటనీ, ఎన్విరాన్‌మెంటు సైన్స్ ఫుడ్ టెక్నాలజీ జెనిటిక్స్ జియాలజీ ఫిజిక్స్, సైకాలజీ, జువాలజీ, ఫిజికల్ ఎడ్యుకేషన్, మైక్రోబయాలజీ సబ్జెక్టుల్లో వందశాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. ఎంఏ ఫస్ట్ సెమిస్టరు తెలుగు, ఇంగ్లీషు, హిస్టరీ ఎకనామిక్స్, ఉర్దూ ఎంకామ్ కోర్సుల్లో వంద శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. అలాగే ఎంఎస్సీ ఫస్ట్ సెమిస్టరులో ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫుడ్‌సైన్స్, జియాలజీ, సైకాలజీ ఎంపీఈవో కోర్సుల్లో వందశాతం ఫలితాలు వచ్చాయన్నారు. మిగిలిన కోర్సుల్లో వందశాతం లోపు ఫలితాలు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు తెచ్చినందుకు ఆయా శాఖల అధ్యాపకులకు పరీక్ష ఫలితాలు సకాలంలో విడుదల చేసిన పరీక్షల విభాగాన్ని ఆయన అభినందించారు. కార్యక్రమంలో సహాయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ మమత, చీఫ్ ఇంజనీరు రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.



పీజీ ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రారు తదితరులు